

సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించింది. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ రైతులు, కౌలు రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. సంక్షేమంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ అప్పుల రాష్ట్రాన్ని అవకాశాల రాష్ట్రంగా తీర్చిదిద్దుతోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 07.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 107 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# 'నేతన్న సేవలో'... ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు

- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిధులు విడుదల చేయనున్న సీఎం
- రూ.179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి
- నేతన్న కుటుంబాలతో ముఖాముఖి కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : నేతన్నల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఉచిత విద్యుత్, రాయితీలు, 50 ఏళ్లకే పింఛన్ అందిస్తూ దన్నుగా ఉంటోన్న ప్రభుత్వం... తాజాగా వారి సంక్షేమానికి మరో అడుగు ముందుకేసింది. నేతన్న సేవలో పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. 7వ తేదీన '12వ జాతీయ చేనేత దినోత్సవం'ను పురస్కరించుకుని 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పథకంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి రూ. 25 వేల సాయం దక్కనుంది. రాష్ట్రవ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లను ప్రభుత్వం అందించనుంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరిరక్షించే లక్ష్యంతో సర్కారు సాయం అందిస్తోంది.

**చేనేత రంగం బలోపేతం దిశగా... :** తాజాగా ప్రవేశపెడుతోన్న నేతన్న సేవలో పథకమే కాకుండా ఇప్పటికే అనేక విధాలుగా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వం-కూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కల్పిస్తోంది.

2 లో..







# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- ప్రతి ఇంటికీ ప్రభుత్వ పనితీరును తీసుకెళ్లాలని సూచన
- మంత్రులకు లోకేశ్ దిశానిర్దేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంత్రులకు సూచించారు. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఎన్నికల సన్నాహాలు, అసెంబ్లీ వ్యూహంపై చర్చించారు. స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు గెలుచుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
స్థానిక సంస్థల ఎన్నికలు నిర్ణీత సమయంలోనే జరుగుతాయని లోకేశ్ స్పష్టం చేసినట్లు సమాచారం. మిగతా 2లో...

## రజత విజేతకు లోకేష్ అభినందనలు

- కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్‌లో మెరిసిన అజయ్‌బాబు
- ఒలింపిక్స్‌లోనూ పతకమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రతిష్టాత్మక గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్ కు చెందిన వల్లూరి అజయ్ బాబు.. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లి నివాసంలో కలిశారు. ఇటీవల గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన అజయ్ బాబు వెయిట్ లిఫ్టింగ్ 79 కేజీల విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించారు. కామన్వెల్త్ క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరచిన వల్లూరి అజయ్ బాబును ఈ సందర్భంగా

## మత్స్యకారులకు రూ.5 లక్షల బీమా

- పైసా భారం లేకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- సంక్షేమానికి 'సమూహ బీమా' శ్రీరామరక్ష
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2 లో

## స్థానిక ఎన్నికలపై ఈసీ దృష్టి




- ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బీసీ రిజర్వేషన్లపై సమీక్ష

మిగతా 2లో...

# అమరావతి... అభివృద్ధికి కేబినెట్ పచ్చజెండా

- 34 అజెండా అంశాలకు ఆమోదం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టం
- పీపీపీ పాలసీకి పచ్చజెండా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర సమగ్రాభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక ప్రోత్సాహం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 34కు పైగా అజెండా అంశాలకు ఆమోదం లభించినట్లు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మిగతా 2లో...

## ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- మహిళల భద్రతకు కొత్త చట్టం..
- నెలాఖరులో వెలిగొండ ప్రారంభం: చంద్రబాబు

వివరాలు 3 లో

## అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం

- ఆస్తుల వేలం ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

వివరాలు 3 లో



## మైనారిటీ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



- సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ
- మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్
- ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణను పరిశీలించిన మంత్రి

2 లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన,ఉన్నత విద్య కు తోడ్పాటు అందిస్తూ ప్రోత్సాహం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## ఎంఎస్ఎంఈలకు రుణ ప్రక్రియ సులభతరం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- సచివాలయంలో బ్యాంకర్లు, ఎంఎస్ఎంఈ అసోసియేషన్ల సమావేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఎంఎస్ఎంఈలకు రుణ ప్రక్రియ సులభతరం చేయాలని బ్యాంకర్లకు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, మిగతా 2లో...

## సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- 53వ ప్రగతి సమావేశంలో రాష్ట్ర చర్యలను వివరించిన చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగతా 3లో...

## హస్తకళలకు సాంకేతిక వెలుగులు





- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనతో ప్రత్యేక క్యూఆర్ కోడ్ విధానం మొదలు
- స్కాన్ చేస్తే చాలు.. కళాఖండం చరిత్ర చెప్పేస్తుంది... కళాకారుడి కష్టాన్ని వివరిస్తుంది..
- నకిలీ ఉత్పత్తుల నిరోధానికీ ఉపయోగం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా లేపాక్షి ప్రత్యేక కార్యాచరణ మొదలుపెట్టింది. దీనిలో భాగంగా ప్రతి కళాఖండం, కళారూపం పూర్తి వివరాలు తెలిసేలా, దాన్ని రూపొందించిన కళాకారుడికి తగిన గుర్తింపు లభించేలా వాటి పూర్తి వివరాలను తెలుసుకునేలా ప్రత్యేక క్యూఆర్ కోడ్ వ్యవస్థ తీసుకురావాలని పవన్ కళ్యాణ్ ఇటీవల నిర్వహించిన మిగతా 3లో...

## అమరావతిలో కేంద్ర ఉద్యోగుల గృహాల నిర్మాణానికి టెండర్లు

- రూ.1,083 కోట్లతో 1,504 నివాస యూనిట్లు
- సీపీడబ్ల్యూడీ ఈ-టెండర్ ప్రక్రియ ప్రారంభం
- పెమ్మసాని చొరవతో ప్రాజెక్టుకు వేగంగా ముందడుగు

**అమరావతి, ఆగస్టు 6 (జర్నలిస్ట్ ఫైల్)**: అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించనున్న జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) గృహ సముదాయ నిర్మాణానికి కేంద్ర ప్రజా పనుల శాఖ (సీపీడబ్ల్యూడీ) టెండర్లు ఆహ్వానించింది. రూ. 1,083.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో మొత్తం 1,504 నివాస యూనిట్లను నిర్మించనున్నారు. టెండర్ ప్రక్రియ ప్రారంభం కావడం ప్రాజెక్టు అమలులో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వేగంగా టెండర్ దశకు చేరుకోవడంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ కీలకంగా నిలిచినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం, ప్రాజెక్టు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించడం ద్వారా పనులు వేగవంతం అయ్యాయని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా మిగతా 2లో...



# అమరావతి.. అభివృద్ధికి కేబినెట్ పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)





ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఏపీ దిశా బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి కొత్త చట్టాలను తీసుకురావాలని నిర్ణయించింది.

అమరావతి అభివృద్ధికి ప్రభుత్వం మరోసారి ప్రాధాన్యం ఇచ్చింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణాన్ని రూ.1,000 కోట్ల వ్యయంతో ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించి రుణ సమీకరణకు అనుమతి ఇచ్చింది. అసెంబ్లీ, హైకోర్టు అదనపు డిజైన్ల వ్యయాన్ని రూ.206 కోట్లకు పెంచుతూ సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రైతుల యాన్యుటీ చెల్లింపుల కోసం తీసుకున్న రూ.300 కోట్ల రుణానికి ఆమోదం తెలపడంతో పాటు, 'అమరావతి ఐ' ప్రాజెక్టు రీ-టెండర్లకు పచ్చజెండా ఊపింది. వైకుంఠపురం ఇనాం భూముల వివాదాన్ని రూ.122 కోట్ల పరిహారంతో పరిష్కరించాలని నిర్ణయించింది.

పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. బల్క్‌డ్రగ్ పార్కు అభివృద్ధికి హుడ్కో నుంచి రూ.680 కోట్ల రుణం తీసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50 విద్యుత్ రాయితీ కొనసాగించాలని నిర్ణయించింది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణ, మున్సిపల్ భూముల లీజు గడువును 25 ఏళ్లకు మించి పెంచేందుకు చట్ట సవరణలకు ఆమోదం తెలిపింది. విశాఖ వెలంపేట మురికివాడ పేదలకు రూ.28.44 కోట్లతో బహుళ అంతస్తుల గృహాల నిర్మాణానికి, కుప్పం విమానాశ్రయ భూ బాధితులకు ఎకరాకు రూ.12.44 లక్షల పరిహారం చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ప్రజా సంక్షేమం, విద్య, మౌలిక వసతుల రంగాలపైనా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పాదచారుల భద్రతా పాలసీ-2026 అమలుకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం, గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా ఘాట్‌ల అభివృద్ధికి రూ.210 కోట్లను కేటాయించింది. విద్యా రంగంలో ఆర్‌వీఎస్, ప్రగతి ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో పాటు కొత్త జిల్లాల కోసం 15 డీఈవో పోస్టులను మంజూరు చేసింది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

## రజత విజేతకు లోకేష్ అభినందనలు



(మొదటి పేజీ తరువాయి)

మంత్రి లోకేష్ అభినందించారు. రజత పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. 2010లో ఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తండ్రి కాంస్య పతకం సాధించగా.. కుమారుడు 16 ఏళ్ల తర్వాత రజత పతకం సాధించి రికార్డ్ సృష్టించారని ప్రశంసించారు. వచ్చే ఒలింపిక్స్ లో పతకం సాధించడమే లక్ష్యంగా అజయ్ బాబు ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం అజయ్ బాబును మంత్రి శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.

## 'నేతన్న సేవలో'... ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు

(మొదటి పేజీ తరువాయి)

దీనికి ఏటా రూ.150 కోట్లు ఖర్చు కానుంది. అంతేకాకుండా 50 ఏళ్లు నిండిన 85 వేల మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుతో పాటు అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా ఏర్పాటు చేస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు :** చీరాల నియోజకవర్గంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి 10.50 గంటలకు చేరుకుంటారు. 11.05 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు జాండ్రపేటలో చేనేతల వర్క్‌షాప్‌లో లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. కొత్తపేటలో 04.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

## మత్స్యకారులకు రూ.5 లక్షల బీమా



శ్రీకాకుళం అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాని మత్స్య సంపద యోజన కింద అమలు చేస్తున్న సమూహ ప్రమాద బీమా పథకం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సముద్రం, జలాశయాలపై వేటపైనే ఆధారపడి జీవించే మత్స్యకారులపై పైసా భారం పడకుండా, ప్రతి సభ్యునికి చెల్లించాల్సిన రూ.79.96 ల ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల మత్స్యకారులు, చేపల రైతులు, వేట వృత్తి అనుబంధ వర్గాల వారందరికీ ఈ ఉచిత బీమా సౌకర్యం వర్తిస్తుందని వివరించారు. గతంలో 18 నుంచి 60 సంవత్సరాల వారికి అర్హత ఉండగా ప్రస్తుతం వీటిని 60 నుంచి 70 సంవత్సరాల వరకు పొడిగించడం జరిగింది,వేట సమయంలో లేదా ఇతర రూపాల్లో జరిగే ప్రమాదాల బారిన పడి మరణించినా, శాశ్వత సంపూర్ణ వైకల్యం పొందినా ఆ కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందుతుందని మంత్రి తెలిపారు. అలాగే శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు, ప్రమాదం వల్ల ఆసుపత్రి పాలైతే చికిత్స నిమిత్తం రూ.25,000 వరకు బీమా సాయం అందుతుందని పేర్కొన్నారు. రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్, యంత్రాల ప్రమాదాలు, పాము కాటు, విషకీటకాల కాటు, అడవి జంతువుల దాడులు వంటి పలు రకాల అపశృతులకు ఈ బీమా వర్తిస్తుందని వెల్లడించారు.

ప్రమాదం జరిగిన నాటి నుంచి 120 రోజుల్లోగా క్లెయిమ్ సమాచారాన్ని అందించి, 180 రోజుల్లోగా దరఖాస్తుతో పాటు సంబంధిత పత్రాలు సమర్పిస్తే.. 90 రోజుల్లోనే క్లెయిమ్‌ను పరిష్కరించి బాధితులకు ఆర్థిక సాయం అందిస్తారని మంత్రి తెలిపారు. మత్స్యకారులు, వారి కుటుంబసభ్యులు ఈ పథకం వివరాల కోసం టోల్ ఫ్రీ నంబరు 1800-425-1660, ల్యాండ్‌లైన్ 040-24000109 లేదా www.gaispmmsy.com వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన తీరును ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. ఇంటింటికీ వెళ్లి కనీసం మూడు నిమిషాల పాటు ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు.

అసెంబ్లీలో చర్చించాల్సిన ప్రధాన అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఎల్‌నినో పరిస్థితులు, వాటి ప్రభావాన్ని ప్రజలకు అసెంబ్లీ వేదికగా వివరించాలని లోకేశ్ సూచించారు. ఇటీవల జలాశయాల్లోకి వరద నీరు చేరడం ఊరటనిచ్చే పరిణామమని పేర్కొంటూ, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యత క్రమంలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, అనంతరం పశుగ్రాస అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని లోకేశ్ మంత్రులకు సూచించారు. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించి వాటి పరిష్కారానికి అసెంబ్లీని సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఎన్నికల సన్నాహాలపై సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో మంత్రులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.



## అమరావతిలో కేంద్ర ఉద్యోగుల గృహాల నిర్మాణానికి టెండర్లు

(మొదటి పేజీ తరువాయి)



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆధునిక నివాస వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ గృహ సముదాయాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో ఈ గృహ సముదాయాన్ని ఈపీసీ విధానంలో నిర్మించనున్నారు. మొత్తం 28 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో మూడు నెలలు ప్రణాళిక, డిజైన్‌కు, మిగిలిన 25 నెలలు నిర్మాణ పనులకు కేటాయించారు.

ఈ ప్రాజెక్టులో మొత్తం 11 హై-రైజ్ టవర్లలో 1,504 నివాస యూనిట్లు నిర్మించనున్నారు. టైప్-2 విభాగంలో 600 యూనిట్లు, టైప్-3లో 600, టైప్-4లో 228, టైప్-5లో 56, టైప్-6లో 20 యూనిట్లు ఉండనున్నాయి. నివాస సముదాయానికి డబుల్ లెవల్ బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయాన్ని కూడా కల్పించనున్నారు.

నివాస భవనాలతో పాటు జి4 అంతస్తుల అనుబంధ భవనాన్ని నిర్మించనున్నారు. ఇందులో గెస్ట్ హౌస్, కమ్యూనిటీ హాల్, వంటశాల, డైనింగ్ హాల్, దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే సెక్యూరిటీ రూమ్, ప్రవేశ ద్వార సముదాయం, విద్యుత్ సబ్‌స్టేషన్లు, డీజీ సెట్ యార్డులు, మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ), ఆర్గానిక్ వేస్ట్ కన్వర్టర్ వంటి మౌలిక వసతులు కల్పించనున్నారు.

రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థ, హైస్పీడ్ ప్రయాణికుల లిఫ్టులు, ఫైర్‌మ్యాన్ లిఫ్టులు, వీఆర్‌ఎఫ్/వీఆర్‌వీ ఎయిర్ కండిషనింగ్, సోలార్ వాటర్ హీటింగ్, ఆధునిక అగ్నిమాపక వ్యవస్థలు, స్ప్రింక్లర్ సిస్టమ్, ఐపీ ఆధారిత సీసీ కెమెరాలు, ఈపీఏబీఎక్స్ నెట్‌వర్క్ వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, ల్యాండ్‌స్కేపింగ్, హార్టికల్చర్ వంటి పర్యావరణహిత ఏర్పాట్లు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉంటాయి.

ఈ గృహ సముదాయాన్ని గ్రీహా 4-స్టార్, ఈఎన్ఎస్ం గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. జాతీయ నిర్మాణ, ఇంధన సంరక్షణ, పర్యావరణ ప్రమాణాలను పాటిస్తూ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.

సీపీడబ్ల్యూడీ ఈ-టెండర్ పోర్టల్ ద్వారా బిడ్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. టెండర్ల సమర్పణకు ఆగస్టు 28ను చివరి తేదీగా నిర్ణయించారు. అర్హత కలిగిన బిడ్డర్ల కోసం ఆగస్టు 12న హైదరాబాద్‌లోని నిర్మాణ్ భవన్‌లో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆధునిక నివాస వసతులు అందుబాటులోకి రావడంతో పాటు పరిపాలనా మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి.

## మైనారిటీ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


(మొదటి పేజీ తరువాయి)




గురువారం ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,కంప్యూటర్ అవగాహన శిక్షణ కార్యక్రమంలో మూడవ రోజు కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ పర్యవేక్షణలో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది 60 మందికి అమరావతి లోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం) ప్రధాన కార్యాలయంలో శిక్షణ జరుగుతోంది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఉర్దూ అకాడమీ 1975లో విద్యా శాఖకు అనుబంధంగా ఏర్పాటైందన్నారు. 1993 లో మైనారిటీల సంక్షేమ శాఖ ఏర్పాటు అయ్యాక ఉర్దూ అకాడమీని, మైనారిటీ సంక్షేమశాఖ క్రిందికి చేర్చడం జరిగింది అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను గతంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నపుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉర్దూ అకాడమీ క్రింద కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం అత్యంత సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యం కలిగిన కంప్యూటర్లను కొనుగోలు చేసి రాష్ట్రంలోని 36 కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. మైనారిటీల విద్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత తో కూడిన కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. మైనారిటీ యువతను సాంకేతికంగా బలోపేతం చేయడానికి ఉర్దూ అకాడమీ చేపడుతున్న ఈ తరహా వినూత్న కార్యక్రమాలు అభినందనీయమని చైర్మన్ ఫారూఖ్ షుబ్లీని మంత్రి ఫరూక్ అభినందించారు. అధ్యాపకులు ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించి, వారిని ఆధునిక సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నిజాముద్దీన్,టర్నిన్ లెర్నింగ్ సొల్యూషన్స్ సీఈఓ శ్రీకాంత్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ కు చెందిన ప్రముఖులు,ట్రైనర్ యశ్వంత్ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథి గా అధ్యాపకుడు మణి దీప్ హాజరై ఉర్దూ అకాడమీ సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణలో ఏఐ, కంప్యూటర్ అవగాహను విశదీకరించారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు పాత్ర, విద్యారంగంలో ఏఐ వినియోగం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు తమ నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. నాలెడ్జ్ టెక్నాలజీస్ ఎండి ఆనందరావు, నైపుణ్యాభివృద్ధి, విద్య, కెరీర్ పై శిక్షణ ఇచ్చారు.

## ఎంఎస్ఎంఈలకు రుణ ప్రక్రియ సులభతరం

(మొదటి పేజీ తరువాయి)



ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. గురువారం మంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్లు, ఎంఎస్ఎంఈ అసోసియేషన్లతో సెక్రటేరియట్‌లోని 5వ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో ఎంఎస్ఎంఈల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని వారికి రుణ ప్రక్రియ సులభతరం చేయాలన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు గారు బ్యాంకు అధికారులతో చర్చించి ఎస్ఎల్‌బీసీలో చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. గౌరవ ముఖ్యమంత్రి గారి లక్ష్యానికి అనుగుణంగానే ఈ రోజు ఈ సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎంఎస్ఈ సీడీపీ, పీఎంఈజీపీ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఏపీ క్లస్టర్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఏపీ చీఫ్ మినిస్టర్ ఎంటర్ ప్రెన్యూర్ ప్రోగ్రామ్ అమలు చేసేందుకు వివిధ బ్యాంకర్ల సహాయ సహకారాలు కోరుతున్నామని మంత్రి తెలిపారు. రుణాలను సీజీటీఎంఎస్ఈ ( క్రెడిట్ గ్యారెంటీ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ) లో కవర్ చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే 4వ స్థానంలో ఉందని.. దీనిని గౌరవ ముఖ్యమంత్రి కోరిక మేరకు మొదటి స్థానంలోకి తీసుకువచ్చేందుకు బ్యాంకర్లు సహకారం అందించాలని మంత్రి కోరారు. ఎంఎస్ఎంఈ అధారిత అసోసియేషన్ల సందేహాలను బ్యాంకర్లు నివృత్తి చేసి.. బ్యాంకు ద్వారా లభ్యమయ్యే సదుపాయాలు వారికి వివరించారు. ఎంఎస్ఎంఈ ఔత్సాహికులకు రుణం దరఖాస్తు కోసం ప్రభుత్వం యూనిఫైడ్ పోర్టల్ తయారు చేసి వాళ్లకు అందుబాటులోకి తీసుకురావాలని ఇండస్ట్రీస్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీధర్‌బాబు, ఇండస్ట్రీస్ సెక్రటరీ డాక్టర్ ఎన్. యువరాజ్, ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వమనోహరన్, ఏపీ ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ సుధాకర్, ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ విజయరత్నంతో పాటు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, క్రెడాయ్ జీవీఎస్ మోహన్‌రావు, ఫుడ్ ప్రాసెసింగ్ సాంబశివరావు, రాజశేఖర్, కోవై రాధిక, ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సెక్రటరీ యూఎం. కుమార్, వివిధ రాష్ట్ర స్థాయి బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై ఈసీ దృష్టి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహాలను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ యంత్రాంగానికి సూచించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా సంబంధిత ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సామగ్రి, వార్డుల పునర్విభజన, కోర్టు కేసులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికలు ఎప్పుడు ప్రకటించినా వెంటనే నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమైన బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. తొలుత జులై 31లోగా నివేదిక సమర్పించాల్సి ఉన్నప్పటికీ, కమిషన్‌కు మరో నెల గడువు పొడిగించడంతో ఆగస్టు 31 నాటికి నివేదిక అందే అవకాశం ఉంది. ఆ నివేదిక ఆధారంగానే బీసీ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాష్ట్రంలోని 13,291 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ నిర్వహణ కోసం సుమారు 1.36 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్ల పునర్విభజన ప్రక్రియ కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పలు కేసులు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉండటంతో వాటి పురోగతిపైనా సమీక్షించారు.

ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిబంధకంగా ఉన్న చట్టం నంబర్--5ను ఉపసంహరించుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో 123 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గతంలో కోర్టు కేసుల కారణంగా 2021 మార్చిలో కేవలం వంద పట్టణ స్థానిక సంస్థలకే ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే.

## యువ పేసర్లపైనే భారం




**కొలంబో:** శ్రీలంకతో జరిగే రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను చేజిక్కించుకుంటామని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ధీమా వ్యక్తం చేశాడు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) గురువారం విడుదల చేసిన ఒక వీడియోలో గంభీర్ ఈ విషయాన్ని వెల్లడించాడు.“ఇటీవలి కాలంలో టెస్టుల్లో మనం ఆశించినస్థాయిలో రాణించలేకపోతున్నాం. స్వదేశీ పిచ్‌లపైనే నిరాశపరుస్తున్నాం.. మన ముందు ఏముందో, మనం దేని కోసం ఆడుతున్నామో అందరికీ తెలుసు. మన సామర్థ్యానికి మించి రాణించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ సిరీస్ గెలుపుతో మనపై వచ్చే విమర్శలకు సమాధానం చెప్పినవారమవుతాం” అని పేర్కొన్నాడు. “మన జట్టులోకి కొందరు కొత్త ఆటగాళ్లు వచ్చారు. సారాంశ్.. నీకు అభినందనలు. ఇక్కడికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డావు” అని మధ్యప్రదేశ్ ఆల్‌రౌండర్‌కు టీమిండియా క్యాప్ అందించాడు. “అవకాశం దొరికినప్పుడల్లా కుటుంబం, దేశం గర్వపడేలా రాణించాలి.” అని పేర్కొన్నాడు. “రెండోది ఆకిబ్‌ను అభినందించాలనుకుంటున్నాను. గత సీజన్‌లో అద్భుతంగా రాణించావు, జమ్మూ-కాశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీ టైటిల్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించావు. ఇది నిజంగా గొప్ప విజయం. మరోసారి అభినందనలు” అన్నాడు. కొత్తగా జట్టులోకి ఎంపికైన సారాంశ్ జైన్ మరియు ఆకిబ్ నబీలతో పాటు, కొత్త ఫీల్డింగ్ కోచ్ సుభదీప్ ఘోష్‌లకు కూడా గంభీర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి, ఆటగాళ్లకు పరిచయం చేశాడు.


**లంక వార్మప్ జట్టు కెప్టెన్‌గా సొనాల్...** రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు భారత్‌జట్టు శ్రీలంకతో మూడ్రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ కోసం శ్రీలంక జట్టు 15మంది ఆటగాళ్లతో కూడిన జట్టును ప్రకటించింది. శుక్రవారం నుంచి మూడ్రోజుల వార్మప్ మ్యాచ్ కొలంబోలోని ఎన్‌సిసి మైదానంలో ప్రారంభం కానుంది. ఆ తర్వాత గాలేకు టీమిండియా బయల్దేరి వెళ్లనుంది. శ్రీలంకతో తొలి టెస్ట్ ఆగస్టు 15నుంచి, రెండో టెస్ట్ ఆగస్టు 23నుంచి కొలంబోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి.

శ్రీలంక వార్మప్ జట్టు: సొనాల్ దినుషా(కెప్టెన్), మధుశంక, రషంత్, సూరియ భండారా, రత్నాయకే, విక్రమసింఘే, అంజలా భండారా(వికెట్ కీపర్), ధనంజయ, లాహిరు కుమార, ఫెర్నాండో, మనోజ్, విజెసుందర, రమేశ్ మెండీస్, కేశర నువంతా, సుధీర.

# అప్పుల రాష్ట్రాన్ని అవకాశాల రాష్ట్రంగా మారుస్తున్నాం

## ప్రజా ప్రభుత్వమే కూటమి ప్రభుత్వం.. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

## తెనాలి 21, 22 వార్డుల్లో ఇంటింటి ప్రచారానికి ఘన స్పందన.. అడుగడుగునా ప్రజల స్వాగతం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా ప్రభుత్వంగా ప్రతి ఇంటి గడపకు చేరుకుని సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార దిశగా ముందుకు సాగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా గురువారం తెనాలి పట్టణంలోని మారీసుపేట 21, 22 వార్డుల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలపాటికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానికులు ఘన స్వాగతం పలికారు. వార్డులన్నీ పార్టీ జెండాలు, నినాదాలతో సందడిగా మారగా, ఆలపాటి ప్రజలతో మమేకమై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.


ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ వారి సమస్యలు, అవసరాలు, సూచనలు తెలుసుకున్న ఆలపాటి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని భరోసా ఇచ్చారు. ప్రజల అభిప్రాయాలే ప్రభుత్వానికి మార్గదర్శకమని, అందుకే ప్రజల వద్దకే వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకునే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరిందని వివరించారు.

ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా, పరిపాలనా పరంగా తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని చెప్పారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం', ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, రైతులకు, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, సూపర్ సిక్స్ హామీల అమలు వంటి కార్యక్రమాలు ప్రతి కుటుంబంలో మార్పు తీసుకొస్తున్నాయని ఆలపాటి పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతు సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అదే విధంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెట్టుబడులు ఆకర్షించడం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆలపాటి అన్నారు. ప్రతి నియోజకవర్గం, ప్రతి గ్రామం, ప్రతి వార్డు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల మద్దతు, ఆశీర్వాదాలతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## హస్తకళలకు సాంకేతిక వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా సూచించారు. పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ కేవలం నెల రోజుల వ్యవధిలో దేశంలో తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

**ఒక్క స్కాన్‌తో పూర్తి వివరాలు :** కళ– ఉత్పత్తి– వివరాలు ప్రతిపాదికన ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చారు. కొనుగోలుదారులు వస్తువుపై ఉన్న కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేస్తే ఆ కళాఖండానికి సంబంధించిన పూర్తి వివరాలను సెకన్లలో తెలుసుకోవచ్చు. ఆ వస్తువు చరిత్ర, సాంస్కృతిక విశిష్టత, తయారు చేసిన కళాకారుడి పేరు, వారి నైపుణ్యం, తయారు చేయడానికి వారు పడిన కష్టం, ఉపయోగించిన ముడిసరుకు, తయారీకి పట్టిన సమయం, వస్తువు కొలతలు వంటి వివరాలతోపాటు, దానికి భౌగోళిక గుర్తింపు లేదా ఒక జిల్లా–ఒక ఉత్పత్తి గుర్తింపు ఉందా అనే సమాచారం కూడా అందుబాటులో ఉంటుంది.

**దశలవారీగా విస్తరణ :** మొదటి దశలో రాష్ట్రంలోని విభిన్న సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే 8 ఐకానిక్ హస్తకళా ఉత్పత్తులకు క్యూఆర్ కోడ్ ప్రొఫైల్స్‌ను అధికారులు కేటాయించారు. బొబ్బిలి వీణతోపాటు, సంపూర్ణ రామాయణం, మహాభారతం, శ్రీ కృష్ణలీలా, మత్స్యావతారం కలంకారి పెయింటింగ్స్, అలాగే సవర ఆదివాసి పెయింటింగ్స్ ఉన్నాయి. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని హస్తకళా ఉత్పత్తులు, కళాకారుల క్లస్టర్లకు ఈ విధానాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా నకిలీ ఉత్పత్తులకు అడ్డుకట్ట పడటంతోపాటు, ఏపీ హస్తకళలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత గుర్తింపు లభించి, కళాకారుల ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

సాంకేతికత ఆధారిత సమగ్ర వ్యవస్థను అమలు చేస్తోందని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జి. సాయి ప్రసాద్ తెలిపారు. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి పి.కె. మిశ్రా అధ్యక్షతన జరిగిన 53వ ప్రగతి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సైబర్ నేర నియంత్రణ చర్యలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. సమావేశంలో ఏపీ సచివాలయం నుంచి ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ, ఎస్పీ అధిరాజ్ సింగ్ పాల్గొన్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించే విధానానికి బదులుగా, నేరం జరగకముందే గుర్తించి నివారించే వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని సాయి ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో స్టేట్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్–4–సీ) ఏర్పాటు చేసి, ఎన్‌సీఆర్‌పీ, 1930 హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే కేసులు నమోదు చేసేందుకు ఈ–జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సైబర్ ఆర్థిక మోసాల బాధితులకు నగదు త్వరగా తిరిగి అందించేందుకు అమలు చేస్తున్న మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం) ద్వారా గత మూడు నెలల్లో రూ. 1.56 కోట్లను పునరుద్ధరించామని, గ్రీవెన్స్ రెడ్రెసల్ మెకానిజం (జీఆర్ఎం) పోర్టల్ ద్వారా 358 ఫిర్యాదులను పరిష్కరించినట్లు వెల్లడించారు. అలాగే సహయోగ్ పోర్టల్ ద్వారా 23,181 అక్రమ యూఆర్ఎల్‌లపై చర్యలు తీసుకుని, వాటిలో 20,926 యూఆర్ఎల్‌లను తొలగించడం లేదా నిలిపివేయడం జరిగిందని తెలిపారు. సమన్వయ పోర్టల్ ద్వారా ఇతర రాష్ట్రాలతో సైబర్ నేరాల సమాచార మార్పిడి వేగవంతంగా సాగుతోందని చీఫ్ సెక్రటరీ చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 4,378 సైబర్ సమాచార అభ్యర్థనల్లో 2,609 పరిష్కరించగా, రాష్ట్రం నుంచి పంపిన 2,959 అభ్యర్థనల్లో 2,351 పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతిబింబ్ మాడ్యూల్ ద్వారా ఏటీఎం లావాదేవీలు, మ్యూల్ అకౌంట్లు, అనుమానాస్పద మొబైల్ నంబర్లను విశ్లేషించి సైబర్ నేర హాట్‌స్పాట్‌లను గుర్తిస్తున్నామని, గత ఐదు నెలల్లో రూ. 6.85 కోట్ల లావాదేవీలను విశ్లేషించి వేలాది మ్యూల్ అకౌంట్లు, అనుమానాస్పద మొబైల్ నంబర్లను గుర్తించి సంబంధిత జిల్లాలకు పంపినట్లు వివరించారు. సైబర్ నేరాల దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచేందుకు మూడు సంవత్సరాల్లో 500 మంది సైబర్ కమాండోలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సాయి ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే 13 మంది శిక్షణ పూర్తి చేయగా, మరో 60 మందికి పైగా శిక్షణకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తత అత్యంత కీలకమని పేర్కొంటూ, గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 89,260 సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. సాంకేతికత, డేటా విశ్లేషణ, వేగవంతమైన ఫిర్యాదుల పరిష్కారం, ప్రజా చైతన్యంతో సైబర్ నేరాలపై సమగ్ర పోరాటాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.

## ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- **మహిళల భద్రతకు కొత్త చట్టం..**
- **నెలాఖరులో వెలిగొండ ప్రారంభం: చంద్రబాబు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 17 నుంచి 20వ తేదీ వం–కు నాలుగు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో మాట్లాడిన ఆయన, అసెంబ్లీలో ప్రజా సమస్యలతో పాటు మహిళల భద్రత, అభివృద్ధి కార్యక్రమాలపై కీలక చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం దిశ చట్టం పేరుతో ప్రజలను మోసం చేసిందని, పోలీస్ స్టేషన్లు, వాహనాల ఏర్పాటుకే పరిమితమై మహిళల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మహిళల భద్రతకు మరింత పటిష్ఠమైన చట్టపరమైన రక్షణ కల్పించేలా సమగ్ర చట్ట సవరణలను తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. మహిళలపై నేరాలను కట్టడి చేసేలా కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళలకు భద్రత కల్పించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని పేర్కొన్నారు.

ఈ నెలాఖరులోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి నల్లమల సాగర్‌కు నీరందిస్తామని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు పనులు డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

గిరిజనులు తమ సంప్రదాయ నృత్యంతో గిన్నిస్ రికార్డు సాధించడం అభినందనీయమని చంద్రబాబు కొనియాడారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభాన్ని రాష్ట్ర ప్రజలందరూ తమ విజయంగా భావించారని చెప్పారు. సముద్రంపై నుంచి విమానాలు వచ్చి రన్‌వేపై దిగే అనుభూతి ప్రయాణికులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, భోగాపురం విమానాశ్రయం రాష్ట్ర అభివృద్ధికి మరో కీలక మైలురాయిగా మారుతుందని సీఎం పేర్కొన్నారు.

## 15 వేల పదాలతో ఏకవాక్య రచనలు - వరల్డ్ రికార్డ్స్ సొంతం చేసుకున్న జాన్‌బాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సాధారణంగా కవులు, రచయితలు తమదైన శైలిలో రచనలు రాసి విజ్ఞానం, వివేకం అందిస్తారు. తమ భావాలు, ఆలోచనలు, అనుభవాలను అందమైన మాటల్లో మలుస్తారు. అలాంటి వారి స్ఫూర్తితో వినూత్నంగా పుస్తకం రాయాలని సంకల్పించారు గుంటూరుకు చెందిన అధ్యాపకుడు. మన పాలకుల గొప్పతనంతో పాటు దేశచరిత్రను ఏకవాక్య పుస్తకం రాసి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నారు. 15 వేల 40 పదాలతో ఒకే సుదీర్ఘ వాక్యంతో పుస్తకం రాసి ఔరా అనిపించుకున్నారు.

తన మదిలోని ఆలోచనలకు అక్షర రూపం ఇస్తున్న ఈయన పేరు నిమ్మగడ్డ డానియేలు జాన్‌బాబు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆంగ్ల, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు. అందరిలా కాకుండా భిన్నంగా ఆలోచించే జాన్‌బాబు అరుదైన ప్రయోగం చేశారు. 15 వేల 40 పదాలతో ఒకే సుదీర్ఘ వాక్యంతో పుస్తకం రాశారు. నమో భారత్, నమో నరేంద్ర మోదీ పేరుతో 40 పేజీల పుస్తకాన్ని ఏక వాక్యంతో పూర్తిచేసి ప్రశంసలందుకున్నారు. అతిపెద్ద వాక్యం రాసిన రచయితగా ప్రపంచ రికార్డు నమోదు చేశారు. 30 రోజుల్లో నమో భారత్, నమో నరేంద్ర మోదీ పుస్తకం : ఆంగ్ల ఉపాధ్యాయుడిగా 30 ఏళ్ల అనుభవం ఉన్న జాన్‌బాబు ఆంగ్లభాషలో నమో భారత్, నమో నరేంద్ర మోదీ పుస్తకాన్ని 30 రోజుల పాటు శ్రమించి ఏకవాక్యంతో పూర్తి చేశారు. దీంతో వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసిన ప్రపంచ రికార్డులో స్థానం దక్కించుకున్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం



- **ఆస్తుల వేలం ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అగ్రిగోల్డ్ బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా అన్ని చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులతో జరిగిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై సమీక్షించారు. బాధితులకు చెల్లింపుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా ఆస్తుల వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకునేందుకు కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం పేర్కొన్నారు. ఈ అంశంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అందుబాటులో ఉన్న ఆస్తులను దశలవారీగా వేలం వేసి బాధితులకు పరిహారం త్వరగా అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వికసిత్ భారత్–2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యాలను ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలు ప్రజలకు చేరువయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద జలాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలో తాగునీటి సమస్యను పూర్తిగా అధిగమించాలని సీఎం అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, అనంతరం పశుగ్రాస కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి వనరుల సమర్థ వినియోగంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

## ఆయుష్ బలోపేతానికి కార్యాచరణ

- **ఆయుష్ సేవలకు రూ.257 కోట్ల ప్రతిపాదనలు**
- **కేంద్రానికి వార్షిక ప్రణాళిక పంపిన రాష్ట్ర ప్రభుత్వం**
- **జీరో వేకెన్సీతో ఖాళీల భర్తీపై సీఎంతో చర్చ: మంత్రి సత్యకుమార్**




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవల విస్తృతికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఈ క్రమంలోనే ఆయుష్ సేవల అభివృద్ధి కోసం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 257 కోట్లు మంజూరు చేయాలని వార్షిక ప్రణాళిక కింద నేషన్ ఆయుష్ మిషన్ కు ప్రతిపాదన పంపించామని తెలిపారు. అలాగే వైద్యారోగ్య శాఖలో మాదిరిగానే ఆయుష్, ఫుడ్ సేఫ్టీ శాఖల్లో జీరో వేకెన్సీ కింద నియామకాలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చిస్తామని వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో , యునాని, సిద్ధ వైద్యులకు రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ జాతీయ ఆయుష్ కమిషన్ నుంచి వార్షిక ప్రణాళిక కింద నిధులు పొందడంలో ఆనాటి గత వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 2024–25లో రూ. 85 కోట్లు, 2025–26లో రూ. 166 కోట్లు చొప్పున కూటమి ప్రభుత్వానికి మంజూరయ్యాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ. 100 కోట్లతో గుంటూరు సమీపంలో కేంద్ర యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన పరిశోధన సంస్థను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం 15 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. గత ప్రభుత్వం ఈ సంస్థ ఏర్పాటు కోసం కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలకు మళ్లించడంతో తదుపరి చర్యలు స్తంభించాయని విమర్శించారు.

**అవగాహన కల్పించిన అనంతరమే ఆయుర్వేదలో శస్త్ర చికిత్సలు :** తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఒక్కొక్కటి రూ. 15 కోట్లు చొప్పున వ్యయం చేసి సమగ్ర ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద, ప్రొద్దుటూరులో యునాని వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ. 70 కోట్లు చొప్పున రూ. 210 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. అలాగే విశాఖలోరూ. 70 కోట్లతో తలపెట్టిన నేచురోపతి వైద్య కళాశాల నిర్మాణం పనులు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే ఆయుష్ ఆరోగ్య మందిరాలకు పూర్తిస్థాయిలో కొత్త భవనాలను నిర్మించే పనులు చివరిదశకు వచ్చాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు వివిధ హోదాల్లో కలిపి 216 మంది ఆయుష్ వైద్యులను నియమించిందన్నారు. ఆయుర్వేదంలోని శల్యతంత్ర, శాకల్యతంత్ర విభాగాలకు సంబంధించి 58 రకాల శస్త్ర చికిత్సలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. సంబంధిత వర్గాలతో చర్చించి, ఈ చికిత్స విధానాలపై పూర్తి అవగాహన కల్పించిన తర్వాత అమలు చేస్తామని చెప్పారు. ఆయుష్‌కు ప్రాధాన్యతనివ్వడమంటే అల్లోపతి వైద్యాన్ని తగ్గించడం కాదని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర చికిత్స, శస్త్ర చికిత్సల్లో అల్లోపతి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, యోగా, ప్రకృతి వైద్య విధానాలను అవలంబించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెప్పారు.

**రోగుల వివరాలు డిజిటలీకరణ :** సదస్సు ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ మాట్లాడతూ, ముగింపు కార్యక్రమంలో రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆయుష్ వైద్య కేంద్రాలను ఎహెచ్ ఎంఐయస్ పోర్టల్ తో అనుసంధానం చేశామని, ఇప్పటికే 60,000 మంది రోగుల వివరాలను నమోదు చేశామన్నారు. రోగుల పేర్ల నమోదు మొదలుకొని మందుల పంపిణీ వరకు అన్ని సేవలను ఒక డిజిటల్ వేదికపై నిర్వహించేలా వ్యవస్థను పటిష్ఠం చేవామని చెప్పారు. గడచిన రెండేళ్లల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఈ సదస్సు మరింత ఉపయోగపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆయుర్వేద కొత్త వైద్య కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ హోమియోపతి సలహాదారు డాక్టర్ ప్రీతా కిజక్కుట్టిల్ మాట్లాడుతూ హోమియో వైద్య శాలల్లో ఒకే విధమైన చికిత్సా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వ యోగా అండ్ నేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, రోగాలు బారిన పడకుండా ఆహార అలవాట్లలో రావాల్సిన మార్పులు, వైద్యుల పాత్ర గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ సదస్సులో ఆయుష్ అదనపు డైరెక్టర్లు శేఖర్, సాయిసుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు, ఏపీ మెడిసినల్, ఆరోమెటిక్ ప్లాంట్స్ బోర్డు సీఈఓ చంద్రశేఖర్, ఇతర అధికారులు మాట్లాడిన వారిలో ఉన్నారు. ఆయుష్ వైద్యులు 550 మంది హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఇటువంటి సదస్సు జరగడం ఇదే తొలిసారి.

# మణుగూరు పికె బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయం

- ఇది సిపిఐ, ఎఐటియుసి విజయం
- భవిష్యత్తులో సింగరేణి మనుగడ కోసం మరిన్ని పోరాటాలు
- ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం గట్టి ప్రయత్నం
- పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు
- కొత్తగూడెం బైపాస్‌కు రూ.500కోట్లు మంజూరు
- సీతారామ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు కృషి
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యేకూనంనేని



**కొత్తగూడెం ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** మణుగూరు పికె బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయమని, ఇది సిపిఐ, ఎఐటియుసి విజయమని, భవిష్యత్తులో సింగరేణి సంస్థ మనుగడకు మరిన్ని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐకార్యాలయం శేషగిరిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు పికెఓసి డిప్‌ప్రయివేట్ పరం కాకుండా సిపిఐ, ఎఐటియుసి కలిసిచేసిన పోరాట ఫలితంగానే సింగరేణికి దక్కిందన్నారు.సిఎం రేవంత్‌రెడ్డికి పలు మార్లు చేసిన అభ్యర్థన మేరకుసింగరేణికి దక్కడంతో కార్మికులంతా ఆనందంతో ఉన్నారని తెలిపారు. తాడిచెర్ల బొగ్గుబ్లాక్‌కూడా సింగరేణికే దక్కిం దని గుర్తుచేశారు. కొత్తగూడెం ప్రాంతం మనుగడ సాగేందుకు పెనగడప, పెనుబల్లి, రాంపురం, అనిశెట్టిపల్లి, పునుగుడు చెలక, హేమచంద్రాపురం ప్రాంతాల్లో ఓపెన్‌కాస్టు చేయవచ్చన్నారు. కొత్తగూడెంఎయిర్‌పోర్టు నిర్మాణం కోసంగట్టి ప్రయత్నాలు చేస్తు న్నామని, ఇక్కడ ఎయిర్‌పోర్టుఏర్పాటు కావడం ద్వారా ప్రయాణా లు సులువవుతాయన్నారు. పారిశ్రామిక ప్రాంతమైన ఈజిల్లాలో ఎయిర్‌పోర్టు ఎంతో అవసరమన్నారు. కొత్తగూడెం కేంద్రంగా పాస్‌పోర్టు సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తున్నామని, పోస్టాఫీసు అను సంధానంగా ఈ పాస్‌పోర్టు సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, ఇందుకు సానుకూల స్పందన వస్తుందన్నారు. కొత్త గూడెం జిల్లా ఆసుపత్రిని సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రిగా తీర్చిదిద్దేం దుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని, ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే రూ. 10కోట్లతో నేషనల్‌స్కిల్‌డవల్మెంట్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులు వచ్చా యని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకైన కేంద్రీయ విద్యాలయం కూడా త్వరలో జిల్లాకు రానుందని, బస్టాండ్ పున:నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంద న్నారు. కొత్తగూడెం బైపాస్కు రూ.500కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈబైపాస్ రోడ్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో వాహన రద్దీ తగ్గుతుందని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లోని యోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామన్నారు. ఈసమావేశంలో నాయ కులు సాబీర్‌పాషా, కొరిమిరాజ్‌కుమార్, వంగా వెంకట్‌రమణ మూర్తి, వైవి.రావు, జీ.వీరాస్వామి, రత్నకుమారి, సందెబోయిన శ్రీనివాసరావు, ప్రశాంత్, జలీల్‌పాషా, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, శ్రీనివాసరావు, హన్మంత రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- బాధితులకు సత్వర న్యాయం అందించాలి

: జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ చట్టంకింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతంచేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత అధికారులను ఆదేశించారు. ఐడిఓసికార్యాలయంలో జిల్లాఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్‌అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ,ఎస్టీ, అట్రాసిటీ కేసుల నమోదులు, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు,కోర్టువిచారణ, బాధితులకు పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, పెండింగ్‌కేసుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం రాష్ట్రప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమన్నారు. 2014నుండి 2026జూలైవరు జిల్లాలోమొత్తం 1,104ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 196కేసులు తప్పుడు కేసులుగా తేలగా, 908కేసుల నిజమైనవిగా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. 859కేసుల్లో చార్జిషీట్లు దాఖలుచేయగా, 12కేసుల్లో శిక్షలు నమోదయ్యాయని, 373కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదల కాగా, 472కేసులు కోర్టు విచారణ దశలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 49కేసులు దర్యాప్తు దశలోకొన సాగుతున్నాయన్నారు. దర్యాప్తులో ఉన్న ప్రతికేసును నాణ్యతతో, వేగవంతంగా పూర్తిచేసి చట్టపరమైన గడువులోపు చార్జిషీట్లు దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా సంబంధిత శాఖలుసమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వంకల్పించే ఆర్థిక సహాయం, పునరావాసం, న్యాయ సహాయం, రక్షణతదితర సంక్షేమ ప్రయోజనాలుసకాలంలో అందేలాచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాఎస్పీ మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును నిరంతరం పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకచర్యలు చేపడుతున్నామని తెలిపారు. 2016నుంచి అమలులో ఉన్న మూడు దశల పరిహార విధానం ప్రకారం, ఎఫ్ఐఆర్ నమోదైన 949కేసుల్లో 928కేసులకు జిల్లా కలెక్టర్ ఆమోదం లభించగా 823కేసులకు పరిహారం మంజూరైందని, 105కేసులుపెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చార్జిషీట్లు దాఖలైన 702కేసుల్లో 580కేసులకు పరిహారం మంజూరైందని, 122కేసులు పెండింగ్‌లోఉన్నాయని, కోర్టు తీర్పు వెలువడిన 7కేసులకుసంబంధించి అన్ని 7కేసుల్లోనూ పరిహారం పూర్తిగా చెల్లించినట్లు వివరించారు. ఎస్సీ,ఎస్టీ, అట్రాసిటీ కేసులతోపాటు ఫోక్సో కేసులను కూడా అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తుచేస్తూ బాధిత చిన్నారులకు అవసరమైన వైద్య, న్యాయ, కౌన్సిలింగ్‌సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజావేదికలలో ఎస్సీ,ఎస్టీ హక్కులు, ఫోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణ, సైబర్‌నేరాల నివారణపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన ప్రజలు వెంటనే 1930సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయడంతోపాటు సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌వేణుగోపాల్, ఆర్డీఓ మధు జిల్లాఎస్సీ అభివృద్ధి శాఖాధికారి శ్రీలత, జిల్లా వైద్యశాఖాధికారి తుకారాంరాథోడ్, సంబంధిత జిల్లా అధికారులు, పబ్లిక్‌ప్రాసిక్యూటర్, జిల్లాస్థాయివిజిలెన్స్‌అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సామ్యానాయక్, లకావత్ వెంకటేశ్వర్లు, లక్ష్మీ, రాంబాబు, కోలూరి రామ్మూర్తి పాల్గొన్నారు.

# నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయండి

- ఏరియా ఆసుపత్రిలో లాక్టేషన్‌మేనేజ్మెంట్ యూనిట్ ప్రారంభించిన పిఓ



**భద్రాచలం ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆసుపత్రిలో పుట్టినప్రతి నవజాత శిశువుకు తల్లి సొంతపాలుమాత్రమే ఇవ్వడాన్ని సంబంధిత డాక్టర్లుప్రోత్సహించాలని, తల్లిపాల వల్ల శిశువులుఎటువంటి అనారోగ్యానికి గురికారని ఐటిడిఏ పిఓ బి.రాహుల్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోతల్లిపాల ప్రోత్సాహం, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతంచేసే లక్ష్యంతో లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్‌ను ఆయన బుధవారంప్రారంభించి మాట్లాడారు. శిశువుల ఆరోగ్యకమైన ఎదుగుదలకు తల్లిపాలు అమూల్యమైనవని, ప్రతి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోని శిశువుకు అందించేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్‌కు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడాన్ని తల్లులకు ప్రోత్సహించాలని అలాగే తల్లిపాలు తీయడానికి సహాయపడాలని, తల్లుల నుండి సేకరించిన పాలను నిర్ధారణ చేసి సురక్షితంగా భద్రపరచాలని అన్నారు. ప్రత్యేకంగా సిబ్బందితోపాటు రిసెప్షన్‌కౌంటర్, తల్లులకు కౌన్సిలింగ్‌గది, తల్లులకోసం పాలుతీసే గది, శుభ్రంగా స్నానాలు చేసుకునే ప్రదేశంతో పాటు ఫ్రిడ్జ్, మరియు డ్రిప్‌ఫ్రీజర్‌తో కూడినపాల నిల్వ గది, బట్టలు మార్చుకునే గది తప్పనిసరిగా ఉండాలని అన్నారు. జిల్లావైద్యాధికారి తుకారాంరాథోడ్ మాట్లాడుతూ.. లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్‌ద్వారా నవజాత శిశువులకు అవసరమైన తల్లిపాల నిర్వహణ, తల్లులకు తల్లిపాలపై అవగాహన సరైన పాలిచ్చే విధానాలపై శిక్షణ, వ్యక్తిగత కౌన్సిలింగ్, అవసరమైన సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఏడిఎంహెచ్‌ఓ సైదులు, ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎం ఓలు సంతోష్, మల్లేష్, రామకృష్ణ, దేవరాజ్, విజయ్, నరసింహారెడ్డి, యుగంధర్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

- రైతుల సమక్షంలోనే పారదర్శకంగా భూ రీ సర్వే
- రీ-సర్వేతో భూ వివాదాలు తగ్గుతాయి
- కొంగర గ్రామసభలో రీ సర్వే పై రైతులకు అవగాహన

**పాలేరు ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను పూర్తిగా పరిష్కరించి శాశ్వతమైన,పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండలంలోని కొంగర గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ రీ-సర్వే పై నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలు భూ సర్వే పై అడిగిన పలు సందేహాలని నివృత్తి చేసి,సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ముందుగా రెవెన్యూ గ్రామ సరిహద్దులను పూర్తిగా ఖరారు చేసిన అనంతరం ప్రభుత్వ భూములు, భూసేకరణ జరిగిన ప్రాంతాలు, ఇతర ప్రత్యేక భూములను గుర్తించి వేరు చేస్తున్నామని వివరించారు. తరువాత మాత్రమే వ్యవసాయ భూములు, రైతుల వ్యక్తిగత భూములను క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు.సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో కొలిచి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.



**భూ రీసర్వే ద్వారా భూ సమస్యల పరిష్కారం..**

పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, ఆన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం, కొంతమందికి తక్కువ విస్తీర్ణం నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని కలెక్టర్ దివాకర టీఎస్ చెప్పారు. గ్రామంలోనీ ప్రతి రైతుకు 48గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలిచి, తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. రైతులు అపోహలకు గురి కాకుండా అధికారులు అందించే సమాచారాన్ని విశ్వసించి భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.కాకరవాయి, బేతుపల్లి గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించిన సందర్భం గుర్తుచేస్తూ,ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి 60 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. అనంతరం బుద్దారంలో నూతనంగా నిర్మిస్తున్న పీఓ భవనం పనులను పరిశీలించి, నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యాక్రమంలో తహసిల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

: రామగుండం సీపి అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** "సురక్షా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" అవగాహన మాసోత్సవాల్లో భాగంగా గోదావరిఖనిలోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి హెచ్‌ఓడీ అధికారులకు సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సైబర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, అధికారులతో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, ప్రస్తుతం నమోదవుతున్న సైబర్ నేరాల్లో దాదాపు 30 శాతం ఇన్వెస్ట్‌మెంట్ మోసాలేనని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లు బాధితుల ఆన్‌లైన్ అలవాట్లు, సోషల్ మీడియా వినియోగాన్ని విశ్లేషించి అధిక లాభాల పేరుతో ఉచ్చులోకి దింపుతున్నారని హెచ్చరించారు. ముఖ్యంగా ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది, ఆర్థికంగా స్థిరపడిన వారే లక్ష్యంగా ఈ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, డీప్‌ఫేక్, ఓటీపీ-కేవైసీ, నకిలీ లింకుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు" అని ఎవరైనా ఒత్తిడి చేస్తే అది మోసానికి సంకేతమని గ్రహించి వెంటనే కుటుంబ సభ్యులకు లేదా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, తద్వారా నిందితుల బ్యాంకు ఖాతాలను నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెరిగిన తరుణంలో వ్యక్తుల ముఖచిత్రం, స్వరాన్ని పోలి ఉండే డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు సృష్టించి మోసాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు లేదా బంధువుల పేరుతో అత్యవసరంగా డబ్బులు పంపాలని మెసేజ్‌లు వస్తే వెంటనే నమ్మకుండా నిజానిజాలు నిర్ధారించుకోవాలని సూచించారు.

పోలీసు శాఖ నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం అత్యంత సమయోచిత మైనదని కొనియాడుతూ, సంస్థలోని ప్రతి ఉద్యోగికి సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అఫ్జల్, సైబర్ క్రైమ్ సిఐలు శ్రీనివాస్, రాణా ప్రతాప్, ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు మారుతి, క్రాంతిలతో పాటు సింగరేణి హెచ్‌ఓడీ అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు

: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ట్రాఫిక్, రవాణా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రవాణా (ఆర్టీఏ), లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, బొగ్గు, యాష్ రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లు కప్పాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆటోలు, ఇతర వాహనాల్లో విద్యార్థులు, ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించవద్దని స్పష్టం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ వంటి ఉల్లంఘనలపై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆదుకునే 'రహ్-వీర్' పథకం,అలాగే ప్రమాదం జరిగిన మొదటి గంట అయిన 'గోల్డెన్ అవర్' ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీపీ సూచించారు. ప్రమాదాల నివారణలో పోలీస్,రవాణా తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, పలువురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కోనేరుకు ప్రముఖుల ఘన నివాళి

- కోనేరు యాదిలో సేవాకార్యక్రమాలు



**కొత్తగూడెం ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెంనియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,మంత్రి దివంగత కోనేరు నాగేశ్వరరావు 10వ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కోనేరు నాగేశ్వరరావు సేవలను స్మరించుకుంటూ కొత్తగూడెంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోనేరు కుమారులు కోనేరుసత్యనారాయణ, కోనేరు పూర్ణచంద్రరావు, ఇతర నాయకులు కలిసి ఎన్టీఆర్ సర్కిల్‌లోని కోనేరు నాగేశ్వరరావు కాంస్య విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమం అనంతరం పెనుగడపలోని దివంగత కోనేరు నాగేశ్వరరావుఘాట్ వద్దకు కోనేరు కుటుంబ సభ్యులు, కోనేరు అభిమానులు వెళ్లి ఘనంగా నివాళ్లు అర్పించారు.అనంతరం కొత్తగూడెం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైరాఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్‌వాసిరెడ్డి రమేష్‌బాబు, కార్పొరేటర్లు రావిరాంబాబు, హరిహరన్‌యాదవ్, శ్రీను, సంవిధాన్‌కమిటీ సభ్యులు అర్జున్‌రావు, అహ్మద్, ఆంతోటిపాల్, ఏనుగుల వెంగళరావు, మద్దెల శివ కుమార్, కోనేరు కుటుంబ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ అవగాహన కార్యక్రమం



**కొత్తపల్లి, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలోనీ మైనారిటీ పాఠశాలలో విద్యార్థులకు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్, గంజా తదితర మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై విపులంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని, తెలియని లింకులు, సందేశాలను నమ్మవద్దని సూచించారు. అలాగే విద్యార్థులు అవసరం లేని విధంగా మొబైల్ ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండాలని, ఎటువంటి దురలవాట్లకు బానిసలు కాకుండా విద్యపై దృష్టి సారించాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో భాగంగా మహిళా కానిస్టేబుల్ కీర్తన విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ముఖ్యంగా బాలికలు పాటించాల్సిన ఆన్‌లైన్ భద్రతా సూచనలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎ. నిరంజన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవి

- సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి
- జూపెడలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**పాలేరు ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** శిశువుకు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తిరుమలాయ పాలెం మండలంలోని జూపెడ గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి అన్నారు.ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో అన్న ప్రాసనతో పాటుగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. శిశువు పుట్టిన వెంటనే మొదటి గంటలోపు తల్లిపాలు (ముర్రుపాలు) పట్టించడం ద్వారా బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.మొదటి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగ్గా ఉండటంతో పాటుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వంటి అనారోగ్యాల నుంచి రక్షణ కల్పించడంలో సహాయ పడతాయని నరేందర్ రెడ్డి తెలిపారు. సూపర్ వైజర్ సాధియా మాట్లాడుతూ.. ఆరు నెలల అనంతరం చిన్నారులకు మెత్తగా ఉడికించిన అన్నం, పప్పు, కిచిడీ, రాగి వంటి చిరుధాన్యాలతో చేసిన ఆహారం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల గుజ్జు, గుడ్డు, పెరుగు వంటి వివిధ రకాల పోషక ఆహారాలను వయస్సుకు అనుగుణంగా అందించాలని సూచించారు. ఆహారం యొక్క పరిమాణం, మందాన్ని క్రమంగా పెంచుతూ పిల్లలకు వైవిధ్యమైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్య వంతులవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధీర్, పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్,అంగన్వాడీ టీచర్లు సుహాసిని, పూలమ్మ, గ్రామ దీపిక వసంత, తల్లులు, బాలింతలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు



**కోహెడ, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** చెంచల్ చెరువు పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం నంబర్ 2లో, ఉపాధ్యాయురాలు అన్నబోయిన సరిత, సర్పంచ్ సంపత్ పర్యవేక్షణలో.. బుధవారం 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు' నిర్వహించారు. శిశువు పుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలని, అలాగే మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని ఈ సందర్భంగా చెప్పారు. గర్భిణులు మరియు పాలిచ్చే తల్లులకు దీనిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆయ మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సోలిపూర్ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ

- పోచమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలుఉ సమర్పించిన మహిళలు
- 5 వార్డు కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్



**షాద్నగర్, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** షాద్నగర్ మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలోని సోలిపూర్ గ్రామంలో బుధవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని అమ్మవార్ల దేవాలయాలను సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకొని మంగళ హారతులు డప్పు వాయిద్యాల మధ్య యువకుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ మైసమ్మ దేవాలయాలకు చేరుకొని బోనాలు సమర్పించి ముక్కులు తీర్చుకు న్నారు. ఈ కార్యక్రమంలో 5 వార్డు కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్, వెంకటేశ్వరరావు పంతులు, శివరాములు యాదవ్, గడ్డం కృష్ణయ్య, వెంకటేష్ గౌడ్, నరేందర్ గౌడ్, సతీష్ బాలరాజ్, బాబు నాయక్, నర్సింలు వెంకటేష్, కుమార్, అంజయ్య, కృష్ణయ్య, రమేష్ యాదవ్ బాలరాజ్, చీపిరి కృష్ణయ్య, కావలి కృష్ణయ్య యాదయ్య శేఖర్. మరియు గ్రామ ముఖ్య నాయకులు పాల్గొని గ్రామస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవార్ల చల్లని దీవెనలు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల అక్రమ రవాణా పై కఠిన చర్యలు

## - డీఎస్పీ అరుణ్ కుమార్



**ఖమ్మం, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** మత్తు పదార్ధాల అక్రమ రవాణా, వినియోగం పై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణ ఎస్ఐ బి. రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను వివేక్ విరాట్ నాగ్ @ వివేక్ నాగ్, తండ్రి సుక్రం నాగ్, నివాసం మహపారా, కొర్ర, సుకుమా జిల్లా (ఛత్తీస్‌గఢ్) కు చెందినవాడిగా గుర్తించారు.విచార ణలో, కలిమేల ప్రాంతానికి చెందిన నితీష్ కుమార్ అనే గంజాయి వ్యాపారి సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించేందుకు సుమారు 11 కిలోల గంజాయిని తీసుకుని భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చినట్లు నిందితుడు అంగీకరించాడు.నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.5,43,500/- విలువైన 11 కిలోల గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం భద్రాచలం పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగరాజు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానానికి హాజరుపరి చారు.ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఇటీవల యువత మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వైపు ఆకర్షితులవుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం లేదా వాటికి సహకరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదా ర్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీ సులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# నడిగడ్డ తాండ సమస్యల పరిష్కారానికి ఉప కమిషనర్ కి వినతి పత్రం.




**మియాపూర్, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** నడిగడ్డ తాండ గిరిజన సంక్షేమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో మాదాపూర్ సర్కిల్ – 50, ఉప కమిషనర్ బాల క్రిష్ణ ని కలిసి నడిగడ్డ తాండలో నెలకొన్న సమస్యల పరిష్కారం గురించి వినతి పత్రం అందజేయడం జరిగింది.ప్రస్తుతం మా తాండలో క్రింది సమస్యలు తీవ్రంగా ఉన్నాయి: వీధి దీపాలు ఉన్న విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదు. అందువల్ల రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కావున నూతన విద్యుత్ దీపాలు మరియు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయవలసి ఉన్నది. పారిశుధ్యం: తాండలోని ప్రధాన రోడ్లు మరియు పరిసర ప్రాంతాలు అంతా అశుభ్రంగా ఉన్నాయి. ప్రతిరోజు శుభ్రపరిచే శానిటేషన్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకో వడం లేదు. డ్రైనేజీ.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుంది. దీనివల్ల మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు.. సి.సి. రోడ్లు: తాండలోని ప్రధాన వీధుల్లో నూతన సి.సి. రోడ్లు ఏర్పాటు చేయవలసి ఉన్నది.మా వినతిని పరిగణలోకి తీసుకున్న ఉప కమిషనర్ సమస్యలను పరి ష్కరించుటకు కృషి చేస్తానని సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సభవత్ హన్మ నాయక్ అధ్యక్షులు, ఇస్లావత్ దశరథ్ నాయక్ ప్రధాన కార్యదర్శి, గోవింద సుధాకర్, దేవనూర్ నర్సింహా★ తదితరులు పాల్గొన్నారు.

# అండమాన్-నికోబార్ ఐస్లాండ్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు మాణిక్యరావుకు ఘన స్వాగతం..

- జూబ్లీహిల్స్ నూతన సీఐ ముత్తు యాదవ్‌కు మర్యాదపూర్వక సన్మానం



**జూబ్లీహిల్స్, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** – అండమాన్–నికోబార్ ఐస్లాండ్ కేంద్రపాలిత ప్రాంతం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాణిక్యరావు హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జూబ్లీహిల్స్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇటీవల జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరిం చిన ముత్తు యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ప్రజలకు న్యాయబ ద్ధమైన, పారదర్శకమైన మరియు ప్రజా సేవకు అంకితమైన పోలీసింగ్ అందించాలని ఆకాంక్షిస్తూ, వారి పదవీకాలం విజ యవంతంగా సాగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవ, సామాజిక ఐక్యత మరియు పరస్పర సహకారంతో సమాజ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని ఇరు వర్గాలకు చెందిన నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భారత్ కిసాన్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డీకే చంద్రశేఖర్ యాదవ్, గురుస్వామి, లక్ష్మణ్, రమణ, వంశీ, తదితర ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# హరీశ్ రావుపై బురదజలడం మాని హామీలు నెరవేర్చండి

## – సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**షాద్నగర్, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** హరీశ్ రావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేక, ఆయన లేవనెత్తిన ప్రజా సమస్యలను పరిష్కరించే దమ్ము లేక కాంగ్రెస్ పార్టీ క్షుద్ర రాజకీయాలకు తెరలేపిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు హిందూ సంస్కృతిని అగౌరవపరుస్తూ, పవిత్ర ఆలయాల ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని, అర్చకుల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ, సనాతన ధర్మం మరియు ధార్మిక కార్యక్రమాలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. మీకు చేతనైతే హరీశ్ రావు అడిగినట్లుగా గోదావరి జలాలను రైతుల పంట పొలాలకు తర లించండి. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయండి. పెంచు తామని హామీ ఇచ్చిన పెన్షన్లను పెంచండి. నిరుద్యోగ భృతిని అందించండి. ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించండి. ఇవన్నీ చేయలేక ప్రశ్నించే హరీశ్ రావు పై బురదజల్లడం ద్వారా ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. హరీశ్ రావు పై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు ఉంచాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గుడులకు వెళ్లడం, పూజలు చేయడం తప్పు అన్నట్లుగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం అత్యంత దురదృ ష్టకరమని అన్నారు. క్షుద్ర పూజల చరిత్ర కాంగ్రెస్ పార్టీకేనని, గతంలో వివాదాస్పద తాంత్రికుడు చంద్రస్వామితో పూజలు చేయించి సీబీఐ విచారణను ఎదుర్కొన్నది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. వర్షాల కోసం యాగాలు, యజ్ఞాలు నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజలకు అవస రమైనది ప్రశ్నలకు సమాధానాలు, సమస్యలకు పరిష్కారాలేనని, నీచ రాజకీయాలు కాదన్నారు. గోదావరి నీళ్లు ఎత్తిపోతలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. దేవుళ్లపై ప్రమాణాలు చేసి ప్రజలకు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ నాయకులదేనని ఆరోపించారు. చేయాల్సిన పనులు వదిలిపెట్టి ఇప్పుడు గుళ్లు, పూజలు, అర్చకులపై వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నా రని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు భక్తిని, విశ్వాసాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని సూచించారు. వర్షాలు కురవకపోతే హరీశ్ రావు తప్పు, రుణమాఫీ అమలు కాకపోతే హరీశ్ రావు తప్పు, కరెంట్ కోతలు వచ్చినా హరీశ్ రావు తప్పు అంటున్నారు. మరి రాష్ట్రంలో ప్రభుత్వం ఎవరిది? అధికారంలో ఉన్న వారు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడా నికి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. హరీశ్ రావు గారిపై ఇన్ని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు వాటికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుం చాలని, లేకపోతే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవుళ్లపై ప్రమాణం చేసి గుడుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పుడు ఆలయాలు, పూజలు, అర్చకులపైనే విమర్శలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్‌కు కేవలం ఐదు రోజులే గడువు

- ఆగస్టు 10లోపు ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోండి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి ఆగస్టు 10తో గడువు ముగియనుంది.ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే సంబంధిత బి ఎల్ ఓలకు ఫారాలు అందజేయాలి.ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలి.జిల్లా వ్యాప్తంగా వీఆర్వోలు, ఏఈఆర్ ఓలు, బిఎల్ ఓలు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి పౌరుడు

బాధ్యతతో వ్యవహరించాలి.భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, జిల్లాలోని అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆగస్టు 10వ తేదీలోపు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు బి ఎల్ ఓలు తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో,తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారిని బి ఎల్ ఓ సంప్రదించి పూర్తి వివరాలతో ఫారాలను సమర్పించాలని తెలిపారు. అసంపూర్ణంగా లేదా తప్పుగా నింపిన ఫారాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, అవసరమైన అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడా తమ వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. పేరు, ఇంటి చిరునామా, వయస్సు, లింగం, కుటుంబ వివరాలు లేదా ఇతర సమాచారంలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గడువులోపు సరిదిద్దించుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి వీఆర్వో ,సహాయ ఎన్నికల నమోదు అధికారి ఏఈఆర్వో లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి సవరణలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఎన్నికల నమోదు అధికారులు ఈ ఆర్ వోలు,సహాయ ఎన్నికల నమోదు అధికారులు ఏ పి ఆర్ ఓలు,బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఓలు కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫారాల స్వీకరణ, సందేహాల నివృత్తి, సవరణల ప్రక్రియలో సహకరిస్తున్నారని తెలిపారు.

ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా భారత ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడం ద్వారా చివరి నిమిషంలో రద్దీని నివారించవచ్చని చెప్పారు.«"ఎస్ఐఆర్ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. ప్రతి ఓటరు తన వివరాలను ఒకసారి పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవడంతో పాటు ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు ఆగస్టు 10వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలి. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలి."» అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ప్రజలకు సూచించారు.కార్యక్రమం: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ,గడువు: 10 ఆగస్టు 2026,ఎవరికి జిల్లాలోని అర్హులైన ఓటర్లందరికీ చేయాల్సింది.ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించడం, ఓటరు వివరాలు పరిశీలించడం, అవసరమైన సవరణలు చేయించుకోవడం.సంప్రదించవలసిన వారు బి ఎల్ ఓలు, వీఆర్వోలు, ఏ ఈ ఆర్ వోలు,విజ్ఞప్తి: చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలి.

# ప్రతి గడపపైనా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి

- ఉద్యమ స్ఫూర్తితో 'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయాలి
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశభక్తిని చాటే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతి గడపకూ ఈ జాతీయ స్ఫూర్తిని తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కన్వీనర్ వేల్పుల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు జరుపుకుంటున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఒక ఉత్సవం మాత్రమే కాదు, అదొక పవిత్రమైన జాతీయ బాధ్యత. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతి ఐక్యతను చాటిచెప్పే ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఖమ్మం జిల్లాలోని ప్రతి పల్లె, ప్రతి వాడలో మువ్వన్నెల జెండా సగర్వంగా ఎగరాలి. పార్టీ శ్రేణులు, నాయకులు అహర్నిశలు శ్రమించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపాలి. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక రాజకీయ కార్యక్రమంగా కాకుండా, ప్రజలందరి పండుగలా మలచాలి" అని ఆయన శ్రేణులకు ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు.అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హర్ ఘర్ తిరంగా వరంగల్ జోన్ కన్వీనర్ గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ జెంటేల, డోకుపర్తి రవీంద్ర కుమార్ తదితరులు మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై అద్భుతమైన మార్గదర్శనం చేశారు. దసరా, దీపావళి లాంటి పండుగలకు ఏ విధంగా అయితే సిద్ధమవుతామో, ఈ జాతీయ పండుగను కూడా అంతే ఘనంగా నిర్వహించాలని, యువతను, మహిళలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ జాతీయవాదాన్ని ఉరకలెత్తించాలని వారు సూచించారు.ఈ చరిత్రాత్మక సన్నాహక కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా ఖమ్మం జిల్లా కో-కన్వీనర్లు కళ్లెం విజయ రెడ్డి, అనంతు ఉపేందర్ రావు, దీకొండ శ్యామ్ సుందర్ విశేషంగా పాలుపంచుకుని తమ వంతు బాధ్యతలను వివరించారు. వీరితో పాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య, రాజేష్, రవి రాథోడ్, వివిధ మోర్చాల అధ్యక్షులు నరుకుల వెంకటేశ్వర్లు, ఆర్. వి. ఎస్. యాదవ్, మంద సరస్వతి, శ్రీరామనేని మనీ, సుదర్శన్, అల్లిక అంజయ్య, కందుల శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మోత్కూరి శ్రీనివాస్

## - ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి అజయ్ ఏకగ్రీవ ఎన్నిక

**మంథని, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** మంథని డివిజన్ ప్రెస్ క్లబ్( వర్కింగ్ జర్నలిస్టులు ) అధ్యక్షునిగా మోత్కూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి అజెయ్ లు ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన ఎన్నికల్లో ముఖ్య సలహాదారుగా కొట్టె రవీందర్, అధ్యక్షులుగా మోత్కూరి శ్రీనివాస్, ఉపాధ్యాక్షులుగా నాగెపల్లి రాజబాబు, కాట వినయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి అజెయ్, కోశాధికారిగా మాదర బోయిన కిషన్, సంయుక్త కార్యదర్శిగా ఆకుల వేణు, అనంతుల సంతోష్, సహాయ కార్యదర్శిగా అసంపల్లి స్వామి, రేణిగుంట్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా మాడిశెట్టి సంతోష్, జనగామ సద్వల్, అరిగేల నారాయణ గౌడ్, సిలివేరి సందీప్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.





# నిధులు, నియామకాలు, సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలి

- జిల్లాలో టీజేఎస్ ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయండి
- టీజేఎస్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో.కోదండరామ్




**ఖమ్మం, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నిధులు,నియమాకాలు, నీళ్లు, సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో.కోదండరామ్ సూచించారు. టీజేఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గా ఎన్నికైన మాదాసు శ్రీనివాసరావు హైద్రాబాద్ లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడారు..ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతం బూత్ కమిటీ నుంచి మండలం, పట్టణాలలో అన్ని కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. సామాజిక న్యాయం దిశగా జన సమితి జెండా కింద ప్రజలను ఏకం చేయాలని సూచించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో తిరుగులేని శక్తి గా నిలపాలని సూచించారు. జిల్లాలో పార్టీని బహుజన ప్రజా ఉద్యమాల వేదికగా తీర్చిదిద్దటానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని నూతన అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్కుమార్, గోపగాని శంకర్రావు, మేకపోతుల నర్సయ్య, జిల్లా నాయకులు మందడి వెంకటేశ్వరరావు, తీగ రాములు, మోహన్రావు, నాగేశ్వరరావు, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి 48వ జన్మదిన వేడుకలు




**వనపర్తి, ఆగస్టు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నంబావి మండల పరిధిలోని లక్షి పల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి 48వ జన్మదిన వేడుకలు చిన్నంబావి మండల చౌరస్తాలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దేవుని రమేష్ మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ తగరం కుర్మయ్య, తగరం ఆటో కుర్మయ్య, తగరం కాన్షిరం, సంకటి మద్దిలేటి, బాల వెంకట్, వై స్వామి, చిన్న మద్దిలేటి, కాకునూరు కృష్ణ, మేస్త్రి వెంకటస్వామి, డ్రైవర్ వెంకట్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంపంగి మద్దిలేటి మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ మాదిగ దండోరా సంఘానికి సేవ చేస్తూ సమాజ సేవలో అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం సందర్భంగా హర్షాతిరేకాల మధ్య జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి.ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు మరియు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని సంపంగి మద్దిలేటి 48వ పుట్టిన రోజు శుభాకాంక్షలు

# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



- స్టీల్ బ్రిడ్జ్, సీడ్ యాక్సెస్ రోడ్డు, ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రారంభోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13న తాడేపల్లిలో స్టీల్ బ్రిడ్జ్, సీడ్ యాక్సెస్ రోడ్డు, ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది.

కె.ఎల్.రావు కాలనీ సమీపంలో నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్, సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద గురువారం జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, అగ్నిమాపక సదుపాయాలు, అత్యవసర సేవలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులు సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పర్యటన సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లా బత్తుల కార్తీక్, అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఎ.టి.వి. రవికుమార్, తెనాలి సబ్ కలెక్టర్ అరుణ కుమారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసరావు, నార్త్ డివిజన్ ఎస్డీపీవో సి. హెచ్. మురళీకృష్ణ, తుళ్లూరు ఎస్డీపీవో టి. మురళీకృష్ణ, ఏడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, తాడేపల్లి ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర బాబు, మంగళగిరి ఫైర్ స్టేషన్ అధికారులు, సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 62కు పెంపు.. ఎంఎస్‌పీటీఏ హర్షం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని 164 ఏపీ మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 18ను మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) స్వాగతించింది. ఈ నిర్ణయం ఉపాధ్యాయులకు ప్రయోజనకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని వారు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, విద్యాశాఖ అధికారులకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా, మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది పదవీ విరమణ వయస్సును కూడా 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులతో పాటు ఇతర సిబ్బందికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తోట్టెంపూడి అభివృద్ధికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు భరోసా

- ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరుస్తున్న కూటమి ప్రభుత్వం
- ఇంటింటి ప్రచారం నిర్వహించిన నక్కా ఆనందబాబు



**చుండూరు(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తోందని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. "2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా చుండూరు మండలం తోట్టెంపూడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకుని వాటిని మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు.

ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. తల్లికి వందనం పథకం కింద 124 మంది విద్యార్థులకు రూ. 36.75 లక్షలు, దీపం--2 ద్వారా 370 కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల ప్రయోజనం, అన్నదాత సుఖీభవ కింద 149 మంది రైతులకు రూ. 20.86 లక్షలు, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల రూపంలో 213 మంది లబ్ధిదారులకు ఏడాదికి సుమారు రూ. 2.31 కోట్ల ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. మహిళా శక్తి, డ్వాక్రా తోడు, పీఎం కిసాన్, ఎన్టీఆర్ వైద్యసేవ, స్కాలర్‌షిప్‌లు, సీఎంఆర్ఎఫ్ తదితర పథకాల ద్వారా గ్రామానికి మొత్తం రూ. 3.30 కోట్ల విలువైన ప్రయోజనాలు అందాయని చెప్పారు.

గ్రామాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆనందబాబు పేర్కొన్నారు. రూ. 6 లక్షలతో సీసీ డ్రైన్లు, రూ. 15 లక్షలతో సీసీ రోడ్లు పూర్తి చేసినట్లు, రూ. 8 లక్షలతో కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం పురోగతిలో ఉందని తెలిపారు. గృహ నిర్మాణ పథకం కింద ఒక ఇంటిని పూర్తి చేసినట్లు చెప్పారు. గ్రామంలో 2.8 కిలోమీటర్ల సీసీ రోడ్లు, ఒక కిలోమీటర్ బీటీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పంపులు, వీధి దీపాలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రం, బస్ షెల్టర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

వేమూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇదే తరహా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్--యూనిట్--బూత్ (సీయూబీ) ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ కార్యకర్తలకు ఆనందబాబు పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, స్వర్ణాంధ్ర--విజన్ 2047 సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయూబీ ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు విజన్.. జగన్ పాయిజన్ : ఎమ్మెల్యే నసీర్

- అభివృద్ధి అంటేనే కూటమి ప్రభుత్వం
- గత ఐదేళ్లలో అన్నింటా విధ్వంసం
- నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- ప్రతి సమస్యకూ పరిష్కారం
- ఇంటింటి ప్రచారంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌కు సీఎం చంద్రబాబు నాయుడు విజనరీ అని, జగన్ విధానం పాయిజన్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక 55వ వార్డు కాకుమానువారితోటలో రెండేళ్ల పాలనపై నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా మన ఇంటికి- మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగాయని, ఒకవైపు పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల కల్పన, ఉద్యోగావకాశాల సృష్టి కొనసాగుతుండగా మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకంటే ఎక్కువ స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ప్రజల్లో ఎలాంటి అసంతృప్తి లేకుండా అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో ఇప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధ్వంసకర శక్తులు ఉన్నాయని, అందుకే ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు నేరుగా వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్, ప్రతి గడపకు చేరుకుని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో మోకాళ్ల లోతు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితులను మార్చేశామన్నారు. డివిజన్ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి దూర ప్రాంతాల వరకు మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. స్థానికులు మా దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ రంగంలో తల్లికి వందనం, సీఎం రిలీఫ్ ఫండ్, ఉచిత వైద్య శిబిరాలు తదితర పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, గత ప్రభుత్వ హయాంలో దశాబ్దకాలంగా నిర్లక్ష్యానికి గురైన పూడికతీత పనులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తి చేశామని అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే రూ. 350 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కేవలం రోడ్లు, డ్రెయిన్లకే పరిమితం కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికీ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# వారం రోజుల్లో చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభించాలి



- ఇంజినీరింగ్ అధికారులకు జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మానస సరోవరం పార్క్ చెరువు, నల్లపాడులోని తెలగమాంబ చెరువుల అభివృద్ధి పనులను వారం రోజులలో ప్రారంభించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం చెరువుల అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీయూజీబీసీఎల్) ప్రతినిధులు, జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ చెరువుల అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా, రోజువారీ కార్యాచరణ ప్రకారం సాగాలని స్పష్టం చేశారు. ఏపీయూజీబీసీఎల్ రూపొందించిన డిజైన్లకు అనుగుణంగా పనులు జరిగేలా జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

అలాగే, రూపొందించిన నమూనా ప్రకారమే పనులు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని ఏపీయూజీబీసీఎల్ ప్రతినిధులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ సూచించారు. నగరంలో చేపట్టనున్న ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను కూడా వెంటనే సిద్ధం చేసి అందజేయాలని కోరారు.

సమావేశంలో జీఎంసీ ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఏపీయూజీబీసీఎల్ ప్రతినిధులు నాగేంద్రకుమార్, ఆంజనేయులు, బేబి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే నియమించాలి

- ఉపాధ్యాయుల కొరతతో బోధన దెబ్బతింటోందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో ఉంచుకుని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తక్షణమే నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరగడం, మరోవైపు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందడంతో బోధనపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నారు.

గురువారం గుంటూరులోని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొనిగల హైమారావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి. లలిత బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. భాస్కరరావు, అసోసియేట్ అధ్యక్షుడు జె.వి. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా ఏ. హరగోపాల్, అధ్యక్షుడిగా తుమాటి రవి, ప్రధాన కార్యదర్శిగా కె. వేణుగోపాలరావు, ఆర్థిక కార్యదర్శిగా వి. రామకృష్ణ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా శీలం శ్రీనివాసరావు, ఎం. కోటేశ్వరరావు, టి. విజయరాజు, ఎం. ఊర్మిళరాణి, ఉపాధ్యక్షులుగా బాబురావు, వై. రమ, ఏ. ఏసేబు, బి. మంగారావు, ఎం. ఝాన్సీరాణి ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శిగా కృష్ణవేణి ఎన్నిక కాగా, కార్యదర్శులుగా ఇందిరా, వి. త్రివేణి, మంగమ్మ, విజయ్‌కుమార్, ఎస్. తులసి, నాగిశెట్టి శ్రీనివాస్, షేక్ జిలానీ, యు. ప్రభావతి, మరో ఇందిరా, ఏ.ఎల్. జ్యోతి, రామానుజమ్మ ఎన్నికయ్యారు. ఆర్థిక కమిటీ సభ్యురాలిగా పి. హృదయరాణి ఎన్నికైనట్లు సంఘం ప్రకటించింది.

# పలువురికి ఆర్థిక సహాయం



- గుమ్మడి వెంకటనారాయణ పుట్టినరోజును పురస్కరించుకొని ఆర్థిక సహాయం

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** జీవి కన్స్ట్రక్షన్ అధినేత గుమ్మడి వెంకటనారాయణ పుట్టినరోజును పురస్కరించుకొని పట్నంలోని సెంట్రావూరు లోని శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో చదువుకునే ఐదుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి 5000 చొప్పన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఒక వికలాంగురాలుకు ట్రై సైకిల్ ను మరియు కూచిపూడి లోని చర్చి నిర్మాణానికి 15 వేల రూపాయలు ఈ సందర్భంగా అందజేశారు. జీవి కన్స్ట్రక్షన్ అధినేత గుమ్మడి వెంకటనారాయణను శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారు అభినందించారు. అనంతరం వృద్ధులకు, పేదవారికి వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెనాలి రైల్వే స్టేషన్ సూపరెంటెంట్ రమణ, గంపల శివ నాగేశ్వరావు, కుర్రా శ్రీనివాసరావు, ప్రతాప్, చంద్రశేఖర్ రెడ్డి, శంకరయ్య, తిరుపతయ్య , విజయకుమార్ శ్రీనివాస్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ-20 ఇంధనంపై ఆప్ తప్పుడు ప్రచారం

- రైతులకు లాభం.. దేశానికి విదేశీ మారకద్రవ్య ఆదా
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఈ-20 (20 శాతం ఇథనాల్ మిశ్రమం కలిగిన పెట్రోల్)పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక విమర్శించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, పంజాబ్‌లో కూడా రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోందని రేణుక అన్నారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో పంజాబ్ కీలక పాత్ర పోషిస్తోందని, ఇథనాల్ ఉత్పత్తి వల్ల రైతులకు లభిస్తున్న ప్రయోజనాలు తమకు రాజకీయంగా నష్టం చేస్తాయనే ఉద్దేశంతోనే కేజ్రీవాల్ ఈ-20పై వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు.

ఈ-20 ఇంధనం వల్ల వాహనాల మైలేజ్ గణనీయంగా తగ్గుతుందనడం అవాస్తవమని ఆమె పేర్కొన్నారు. వాహనం మోడల్, డ్రైవింగ్ విధానాన్ని బట్టి కేవలం ఒకటి నుంచి ఐదు శాతం వరకు మాత్రమే స్వల్ప తేడా ఉండవచ్చని, సాధారణ పెట్రోల్ వినియోగంలోనూ ఇలాంటి మార్పులు సహజమేనన్నారు. ఈ-20 వాడితే వాహనాల వారంటీ, బీమా రద్దవుతాయనడం కూడా పూర్తిగా తప్పుడు ప్రచారమేనని, తయారీ సంస్థలు, బీమా సంస్థలు అలాంటి ఆంక్షలు లేవని ఇప్పటికే స్పష్టం చేశాయని చెప్పారు.

ఈ-20 వల్ల ఇంజిన్లు దెబ్బతింటాయనడంలో కూడా నిజం లేదని రేణుక అన్నారు. 2023 నుంచే ఈ-20కు అనుకూలంగా వాహనాల తయారీ జరుగుతోందని, 2024 నుంచి దేశంలోని పలు నగరాల్లో ఈ ఇంధనం వినియోగంలో ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున ఎలాంటి సాంకేతిక సమస్యలు నమోదు కాలేదని పేర్కొన్నారు. సెకండ్ హ్యాండ్ వాహనాల మార్కెట్ కూడా వృద్ధి చెందుతుండడం ఈ ప్రచారానికి సమాధానమని అన్నారు.

ఇథనాల్ విధానం అమెరికా ప్రయోజనాల కోసమేనని కేజ్రీవాల్ చేస్తున్న వ్యాఖ్యలు అవగాహనలేమికి నిదర్శనమని ఆమె విమర్శించారు. భారత్‌లో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్ దేశ అవసరాలకు సరిపోతుందని, పెట్రోల్ బ్లెండింగ్ కోసం విదేశాల నుంచి ఇథనాల్ దిగుమతి చేసుకోవడం లేదన్నారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ వంటి అనేక దేశాల్లో ఇప్పటికే ఇథనాల్ మిశ్రమ ఇంధనం విజయవంతంగా వినియోగంలో ఉందని గుర్తు చేశారు.

వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని మోదీ ప్రభుత్వం వేగవంతం చేసిందని రేణుక తెలిపారు. 2030 నాటికి 20 శాతం బ్లెండింగ్ లక్ష్యాన్ని నిర్దేశించగా, ఐదేళ్ల ముందుగానే 2025లోనే ఆ లక్ష్యాన్ని భారత్ సాధించిందన్నారు. చెరకు, మొక్కజొన్న, నూకల ద్వారా ఇథనాల్ ఉత్పత్తి పెరగడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తోందని, ముడి చమురు దిగుమతులపై దేశ వ్యయం తగ్గి విదేశీ మారకద్రవ్య ఆదా అవుతోందని చెప్పారు. అలాగే ఇంధన భద్రత బలోపేతం కావడంతో పాటు కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ-20 దోహదపడుతుందని వివరించారు.

సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్ , ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం వంటి సంస్థలతో విస్తృత పరిశోధనలు, 60 వేలకుపైగా ట్రయల్ రన్స్ నిర్వహించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం ఈ-20ను అమల్లోకి తీసుకొచ్చిందని రేణుక తెలిపారు. ప్రజలు ఆప్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్భయంగా ఈ-20 ఇంధనాన్ని వినియోగించవచ్చని ఆమె సూచించారు.

# గళ్లా మాధవి జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన పార్టీ శ్రేణులు

- నియోజకవర్గవ్యాప్తంగా 2,500 మొక్కల నాటకం, రక్తదానం, అన్నదానం, అవయవదాన ప్రతిజ్ఞ కార్యక్రమాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్లా మాధవి జన్మదిన వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మొత్తం 2,500 మొక్కలను నాటి గళ్లా మాధవి జన్మదినాన్ని హరితోత్సవంగా జరుపుకున్నారు.

కాలనీలు, ప్రధాన రహదారులు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలు, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలను స్థానిక నాయకులు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సుఖవాసి శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పేరం శ్రీను ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యే గళ్లా మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 22వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి సయ్యద్ చాంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించి సేవా భావాన్ని చాటారు.

జన్మదిన వేడుకల సందర్భంగా మానవత సేవాసమితి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి అవయవదాన ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గర్నపూడి శివ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముస్లిం మైనారిటీ నాయకులు హజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

18వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉల్లి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకోగా, 28వ డివిజన్ అధ్యక్షులు ఏపీ యాదవ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీతో పాటు మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు.

21, 24, 25 డివిజన్ల అధ్యక్షుల ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్‌లో కేక్ కటింగ్, బహిరంగ సభ, భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాసరావుపేట పీర్ల చావిడి సెంటర్‌లో బీడింగ్ సుభాని, చింతకాయల వెంకటసాయి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, మొక్కల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించగా, స్తంభాల గరువు సెంటర్‌లోని అన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నియోజకవర్గ తెలుగు యువత కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

33వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోపూరి నరేంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మొక్కలు నాటి ఎమ్మెల్యే గళ్లా మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 22వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతకాయల వెంకటసాయి, మిర్చి యార్డు డైరెక్టర్ ఖాదర్ బీ, జనసేన నాయకులు ఆళ్ల హరి, బీజేపీ నాయకులు అప్పిశెట్టి రంగా, మహబూబ్ సుభాని, ఎర్రబాషా తదితరులు మొక్కలు నాటి వేడుకల్లో పాల్గొన్నారు. 34వ డివిజన్ కోబాలుపేటలో పశ్చిమ నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు పఠాన్ అస్మతుల్లా ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దల చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే గళ్లా మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో 34వ డివిజన్ అధ్యక్షులు అన్వర్, ప్రధాన కార్యదర్శి వాసు, సత్యనారాయణ, రాష్ట్ర మైనారిటీ నాయకులు మీరావలి తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాష్ట్ర బీసీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో బీసీల పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యే గళ్లా మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శేషయ్య, వేములకొండ శ్రీనివాస్‌తో పాటు బీసీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, అవయవదాన ప్రతిజ్ఞ కార్యక్రమాలు, పండ్ల పంపిణీ, చీరల పంపిణీ, మొక్కల నాటకం, మొక్కల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎమ్మెల్యే గళ్లా మాధవి జన్మదినాన్ని సేవా దినోత్సవంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజా సేవ, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు నియోజకవర్గ ప్రజల ప్రశంసలు అందుకున్నాయి.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పేద వైద్య విద్యార్థులకు 'ఫోనిక్స్' చేయూత



- డా.ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం
- ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు: మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఈ ఏడాది 10 మందికి.. దశలవారీగా ఏటా 50 మందికి ఉపకారవేతనాలు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్య విద్యకు దూరం కాకూడదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఫోనిక్స్ ఫౌండేషన్, డా.ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం మధ్య గురువారం మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతో ఎంపికైన విద్యార్థులకు వైద్య కోర్సు పూర్తయ్యే వరకు చదువు, వసతి ఖర్చులకు ఆర్థిక సహాయం అందనుంది.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న విద్యార్థుల భవిష్యత్తును కుటుంబ ఆర్థిక పరిస్థితులు నిర్ణయించకూడదన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్యులుగా ఎదిగేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఫోనిక్స్ ఫౌండేషన్ సహకారం తోడవుతుందని తెలిపారు. ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా విద్యార్థులకు నిరంతర మార్గదర్శకత్వం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతని చెప్పారు. ఉపకారవేతనాలు పొందే విద్యార్థులు ఉత్తమ వైద్యులుగా ఎదిగి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

దివంగత చుక్కపల్లి శంకరరావు జ్ఞాపకార్థం ఆయన శతజయంతి సందర్భంగా 2025లో ఫోనిక్స్ ఫౌండేషన్ వైద్య ఉపకారవేతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతిభావంతులైన యువతకు అవకాశాలు కల్పించాలన్న ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు ఈ పథకాన్ని చేపట్టారు.

2026–27 విద్యా సంవత్సరంలో తొలుత 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. 2027–28లో 20 మంది, 2028–29లో 30 మంది, 2029–30లో 40 మంది, 2030–31లో 50 మందికి కొత్తగా ఉపకారవేతనాలు అందిస్తారు. 2031–32 నుంచి ప్రతి సంవత్సరం 50 మంది కొత్త విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి వైద్య కోర్సు పూర్తయ్యే వరకు నిబంధనల మేరకు ట్యూషన్ ఫీజులో వందశాతం వరకు సాయం అందిస్తారు. అవసరమైన వారికి వసతి గృహ రుసుములను కూడా చెల్లిస్తారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి కనీసం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందేలా పథకాన్ని రూపొందించారు. ఈ మొత్తాన్ని నేరుగా సంబంధిత విద్యాసంస్థ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. విద్యార్థుల చదువు, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రత్యేక మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండి, ఎంపిక చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026–27 నుంచి ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులు అర్హులు. చదువులో ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమాజ సేవపై ఆసక్తిని పరిగణనలోకి తీసుకుంటారు. దివ్యాంగులు, నిరుపేద కుటుంబాల విద్యార్థులు, బాలికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. ఇతర ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉపకారవేతనాలు పొందుతున్నవారు ఈ పథకానికి అర్హులు కారు. విశ్వవిద్యాలయం పరిశీలించి గరిష్ఠంగా 40 మంది పేర్లను ఫీనిక్స్ ఫౌండేషన్‌కు పంపుతుంది. విద్యా ప్రతిభ, విద్యార్థి నేపథ్యం, వ్యాసరచన, వ్యక్తిగత ముఖాముఖి ఆధారంగా వారిలో 10 మందిని ఎంపిక చేస్తారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల చదువు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనడం, సామాజిక బాధ్యతను పరిశీలించిన తరువాతే ఉపకారవేతనాన్ని కొనసాగిస్తారు.

**మంత్రి సమక్షంలో సంతకాలు**

రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్, ఫోనిక్స్ ముఖ్య నిర్వాహకులు చుక్కపల్లి సురేష్ , సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్, జాయింట్ రిజిస్ట్రార్ నీలిమ, ఫోనిక్స్ ముఖ్య ప్రతినిధి బొమ్మినేని భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

## ప్రైమ్ వాలీబాల్ లీగ్ ట్రయల్స్‌లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి




- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సెలెక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ చాటుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి యువ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బ్లాక్ హాక్స్ ఆధ్వర్యంలో విజయవాడలోని వీఆర్ సిద్ధార్థ కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్–21, ఓపెన్ విభాగాల వాలీబాల్ ట్రయల్స్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో క్రీడాకారులు ట్రయల్స్‌కు హాజరుకావడం ఆనందదాయకమని మంత్రి అన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకుని ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆడే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, కఠోర శ్రమతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచ స్థాయి వేదికగా ఎదుగుతున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్ ట్రయల్స్‌ను విజయవాడలో నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమణ, బ్లాక్ బాక్స్ వ్యవస్థాపకుడు అభిషేక్ రెడ్డి, టెక్నికల్ ఆర్గనైజర్ తులసి రెడ్డి, వీఆర్ సిద్ధార్థ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని శుక్రవారం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. కాకినాడ జిల్లా కోరింగిలో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అగ్నికుల క్షత్రియుల సామాజిక, విద్యా అభ్యున్నతికి, ఆయుర్వేద వైద్య రంగానికి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భావి తరాలకు ఆయన సేవలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందని, ఈ నిర్ణయం బీసీల మనోభావాలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి నిదర్శనమని మంత్రి తెలిపారు.

## విజయవాడ జీజీహెచ్‌లో ఉచితంగా గుండె ఆపరేషన్లు

- డాక్టర్ రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యం వెల్లడి
- మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సంసిద్ధత లేఖ అందజేత



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడ జీజీహెచ్‌లో ఉచితంగా బైపాస్ సర్జరీలు చేసేందుకు డాక్టర్ రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యం ముందుకొచ్చింది. తమ సంస్థ 38వ వార్షికోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని విజయవాడ జీజీహెచ్ కు వచ్చే పేదల్లో అవసరమైన వారికి తొలి దశలో నెలకు కనీసం 5 చొప్పున గుండెకు సంబంధించిన బైపాస్ సర్జరీలను చేస్తామని డాక్టర్ రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యం ముఖ్య ప్రతినిధులు డాక్టర్ సుదర్శన్, రాజశేఖర్ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విజయవాడలో సంసిద్ధత లేఖను గురువారం అందజేశారు. శస్త్ర చికిత్సల అనంతర వైద్యాన్ని' టెలీ ఐసియు' విధానంలో అందిస్తామని లేఖలో పేర్కొన్నారు. రమేష్ హాస్పిటల్స్ యాజమాన్య చొరవను మంత్రి ఆహ్వానించారు.

## తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే అత్యంత నిరుపేదలను ప్రభుత్వం,దాతలు ఆదుకోవాలి



**పురిటిగడ్డ(చల్లపల్లి)(జర్నలిస్ట్ ఫైల్):** అత్యంత నిరుపేదలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చి వారి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఎదురయ్యే పరిస్థితులు చాలా బాధాకరమైనవని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు,ఆర్థిక ఇబ్బందులతో దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్న పురిటిగడ్డ ఎస్సీ వాడలో నిరుపేద కుటుంబానికి చెందిన దంపతులు కనపర్తి దేవసహాయం,వీరమ్మ లను సురేష్ బాబు కలిసి పరామర్శించారు. వారికి డ్రై ఫ్రూట్స్ అందజేసి కొంత సమయం వారితో గడిపి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ అత్యంత నిరుపేద కుటుంబాలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తే ఆ కుటుంబం శారీరకంగా, మానసికంగా,ఆర్థికంగా కృంగిపోతుందని అన్నారు. పూట గడవడం కష్టంగా ఉన్న నిరుపేద కుటుంబాలు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కోలేక దయనీయస్థితిలో ఉండటం తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు. కష్టకాలంలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతోపాటు మానసిక ధైర్యం,భరోసా ను కలిగించేలా దాతలు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని కోరారు. పేదరికంలో ఉన్న రోగుల కొరకు ప్రభుత్వం ప్రత్యేక నిధి కేటాయించాలని సురేష్ బాబు కోరారు. దయనీయ స్థితిలో ఉన్న కుటుంబానికి చేయుతనివ్వటం వారికి ప్రాణదానం చేయడంతో సమానమని సురేష్ బాబు తెలిపారు.

# అభివృద్ధి-సంక్షేమంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం

- రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి, సంక్షేమ మార్గంలో నడిపించడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన "ప్రోగ్రెస్ రిపోర్ట్" రాష్ట్ర పునర్నిర్మాణానికి అద్దం పట్టే పత్రంగా నిలిచిందన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రంతో సమన్వయం లోపించి అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని, భారీ అప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 86 కేంద్ర పథకాలను పునరుద్ధరించి, రూ.8,695 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయించడంతో పాటు రాష్ట్రానికి మొత్తం రూ.45,138 కోట్ల కేంద్ర నిధులను సాధించిందన్నారు. రూ.1.50 లక్షల కోట్ల రుణాలను రీషెడ్యూల్ చేయడం ద్వారా రూ.8,269 కోట్ల వడ్డీ భారం తగ్గించామని, ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు, పెండింగ్ బిల్లులు రూ.19,357 కోట్లు చెల్లించి ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించామని పేర్కొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని, రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్లను వివిధ పథకాల అమలుకు ఖర్చు చేసిందన్నారు. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0, ఎన్టీఆర్ వైద్యసేవ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఎస్సీలకు రూ.19,100 కోట్లు, ఎస్టీలకు రూ.5,730 కోట్లు, బీసీలకు రూ.32,534 కోట్లు, మైనారిటీలకు రూ.4,856 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం రూ.2,246 కోట్ల రుణ మద్దతుతో పాటు బ్యాంక్ క్రెడిట్ లింకేజ్ ద్వారా రూ.43,219 కోట్ల ఆర్థిక సహాయం అందించామని వివరించారు.

అభివృద్ధి రంగంలో రూ.1.34 లక్షల కోట్ల మూలధన వ్యయంతో అమరావతి, పోలవరం, పోర్టులు, విమానాశ్రయాలు, జల్ జీవన్ మిషన్, రహదారుల అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని నక్కా ఆనందబాబు తెలిపారు. అమరావతికి రూ.10,057 కోట్లు, పోలవరానికి రూ.8,323 కోట్లు, పోర్టులకు రూ.5,437 కోట్లు, రహదారులకు రూ.3,439 కోట్లు కేటాయించామని చెప్పారు. అలాగే రాష్ట్రంలో 3,800 కిలోమీటర్ల మేర గుంతలు లేని రహదారులను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం సమక్షంలో జరిగే సమావేశంలో చర్చిస్తాం
- వయోపరిమితి 62 సం.కు పెంపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తాం
- ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అలపర్తి విద్యాసాగర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** గవర్నమెంట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషిచేస్తానని.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంపుపై త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో జరగనున్న సమావేశంలో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎపి జేఏసి చైర్మన్ ఎ.విద్యాసాగర్ తెలిపారు.

ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యవర్గ సమావేశం గురువారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో జరిగింది. సమావేశం అనంతరం ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, ఎన్ జి జి ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ, ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మర్యాద పూర్వకంగా కలిసీ ఉద్యోగుల సమస్యలు, న్యాయమైన డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన అనంతరం అలపర్తి విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలిపారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్న డిమాండ్ సహా ఉద్యోగుల ప్రధాన సమస్యలన్నింటినీ ఇటీవల జరిగిన మంత్రుల బృందం సమావేశంలో చర్చించడం జరిగిందని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో ఉద్యోగుల డిమాండ్లపై జరిగే సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించి ప్రభుత్వం ఈ అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకునేలా మా వంతు ప్రయత్నం చేస్తామని అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. అలాగే, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలకు అనుగుణంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలే ధ్యేయంగా ఎపి జేఏసి అడుగులు వేస్తుందని ముఖ్యమంత్రి సమక్షంలో జరిగే సమావేశంలో పిఆర్సి చైర్మన్ నియామకం ఐ ఆర్ మంజూరు డి ఏ బకాయిలు విడుదల పెండింగ్ బిల్లుల చెల్లింపు టీచర్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం వంటి విషయాల పై ప్రభుత్వం నుండి సానుకూల స్పందన ఉంటుందని ఆశాభావం తో ఉన్నామని లేని పక్షం లో తదుపరి కార్యాచరణ కు జే ఏ సి నాయకులు సిద్ధంగా ఉన్నారని విద్యాసాగర్ తెలిపారు.

కార్యక్రమంలో గవర్నమెంట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాణ్యం వేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగభూషణం, రత్నం, వెంకటేశ్వరరావు, సంతోష్, హైమావతి, కళ్యాణి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీసా ఫ్రాడ్ ఆరోపణలు.. భారత సంతతి మహిళకు అండగా నిలిచిన యూఎస్ ప్రభుత్వం

- అమెరికాలో భారత సంతతి మహిళపై వీసా ఫ్రాడ్ ఆరోపణలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టుతో దుష్ప్రచారం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** అమెరికాలో నివసిస్తున్న భారత సంతతి బయోమెడికల్ ఇంజనీర్, కూచిపూడి నృత్యకారిణి సాధన గొల్లపూడిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన తప్పుడు ప్రచారాన్ని అక్కడి ప్రభుత్వ యంత్రాంగం ఖండించింది. ఆమె వీసా నిబంధనలు ఉల్లంఘించారంటూ 'ఎక్స్'లో వైరల్ అయిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఆమె అమెరికా పౌరురాలని టెక్సాస్ సదరన్ డిస్ట్రిక్ట్ యూఎస్ అటార్నీ స్పష్టం చేశారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, భారత్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెట్టే ఒక 'ఎక్స్' ఖాతా, హ్యూస్టన్‌లో సాధన గొల్లపూడి ప్రదర్శించిన కూచిపూడి నృత్య వీడియోను షేర్ చేసింది. ఆమె దశాబ్ద కాలంగా ఎఫ్–1 స్టూడెంట్ వీసాపై అక్రమంగా అమెరికాలో కొనసాగుతూ, నిబంధనలకు విరుద్ధంగా డ్యాన్సర్, ట్యూటర్‌గా పనిచేస్తున్నారంటూ సదరు ఖాతా ఆరోపించింది. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో లక్షలాది వ్యూస్‌తో వైరల్‌గా మారింది.

ఈ అంశం ఆన్‌లైన్ వేదికగా తీవ్ర చర్చకు దారితీయడంతో, యూఎస్ అటార్నీ ఆరోన్ రీట్జ్ స్పందించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఆ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. "ఈ విషయాన్ని మా దృష్టికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు. మా కార్యాలయం దీనిపై దర్యాప్తు చేపట్టింది. ఆమె అమెరికా పౌరురాలు, స్టూడెంట్ వీసాపై ఇక్కడ లేరు" అని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. వీసా మోసాలను తమ విభాగం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని, అయితే సాధనపై వచ్చిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన వివరించారు.

ప్రస్తుతం హ్యూస్టన్‌లో నివసిస్తున్న సాధన గొల్లపూడి, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో సీనియర్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఒక ప్రైవేట్ వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దుష్ప్రచారానికి ఒడిగట్టడంపై 'ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ యాక్షన్ ఫండ్' వంటి సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

## రాముడిగా సల్మాన్ ఖాన్.. 40 శాతం షూటింగ్ తర్వాత ఊహించని ట్విస్ట్

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఒకప్పుడు బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ కూడా 'రామాయణం'లో శ్రీరాముడి పాత్ర పోషించాల్సి వచ్చిందనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. ప్రస్తుతం రణబీర్ కపూర్‌తో నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ 'రామాయణం' సినిమా నేపథ్యంలో ఈ పాత ప్రాజెక్టు మళ్లీ వార్తల్లోకి వచ్చింది.

1990ల్లో సోహైల్ ఖాన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఇందులో శ్రీరాముడిగా సల్మాన్ ఖాన్, సీతగా సోనాలి బింద్రే నటించాల్సి ఉంది. పూజా భట్‌కు కూడా కీలక పాత్ర ఇచ్చినట్లు పలు కథనాలు చెబుతున్నాయి.

ఈ సినిమా కేవలం ప్రకటించిన ప్రాజెక్టు మాత్రమే కాదు. దాదాపు 40 శాతం చిత్రీకరణ కూడా పూర్తైంది. సల్మాన్ రాముడి వేషధారణలో విల్లు, బాణాలతో ప్రచార ఫొటోలకు కూడా ఫోజులిచ్చారు.

అయితే ఆర్థిక సమస్యలు, సాంకేతిక కారణాలతో సినిమా ఆగిపోలేదు. చిత్రీకరణ సమయంలో సోహైల్ ఖాన్, పూజా భట్ మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈ వ్యవహారంలో కుటుంబ సభ్యుల జోక్యం తర్వాత పరిస్థితులు మారిపోయాయని కథనాలు పేర్కొంటున్నాయి. సల్మాన్ మధ్యవర్తిత్వం చేసినా ఫలితం లేకపోయిందని, చివరకు పూజా భట్ ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో సినిమా పూర్తిగా నిలిచిపోయిందని సమాచారం.

# ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమాలకు ఏఐటీయూసీ, సీఐటీయూ సంపూర్ణ మద్దతు

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ
- ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- కార్మిక సంఘాల నాయకత్వానికి ఏపీ జేఏసీ అమరావతి కృతజ్ఞతలు






**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి చేపట్టనున్న ఉద్యమ కార్యక్రమాలకు ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర నాయకత్వాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వం స్పందనను బట్టి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్న నేపథ్యంలో మద్దతు కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం విజయవాడలోని ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర కార్యాలయాలను సందర్శించి ఆయా సంఘాల రాష్ట్ర నాయకులతో సమావేశమైంది.

సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం అవలంబిస్తున్న జాప్య వైఖరి, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపకపోవడం వల్ల ఏర్పడుతున్న పరిస్థితులను ఏపీ జేఏసీ ప్రతినిధులు వివరించారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వంతో చర్చల ద్వారా సత్వర నిర్ణయాలు తీసుకునేలా చర్యలు అవసరమని వారు కార్మిక సంఘాల నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ప్రభుత్వం స్పందనను బట్టి రానున్న రోజుల్లో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణపై కూడా వివరించారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ సంఘాలతో తక్షణమే చర్చలు జరిపి సమస్యలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు చేపట్టే న్యాయమైన పోరాటాలకు ఏఐటీయూసీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమాలకు పూర్తి మద్దతు అందిస్తామని స్పష్టం చేశారు.

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టే ఉద్యమాలకు సీఐటీయూ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తుందని, ఏపీ జేఏసీ అమరావతి నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో తమ సంఘం చురుకుగా పాల్గొంటుందని హామీ ఇచ్చారు.

కార్మిక సంఘాల నాయకత్వం ప్రకటించిన సంఘీభావం ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్రకమిటీ పేర్కొంది. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘీభావం తెలియజేసి, భవిష్యత్ ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర నాయకత్వాలకు ఏపీ జేఏసీ అమరావతి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఉద్యమ కమిటీ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467